జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 132 | మంగళవారం 7 అక్టోబరు– 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## విశాఖ ఉక్కు గాడినపడుతోంది...

## బలోపేతానికి పూర్తి సహకారం అందిస్తాం: సీఎం చంద్రబాబు



- ఏడాదిలోనే భారీగా పుంజుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి
- 25 శాతం నుంచి 79 శాతానికి చేరిన కెపాసిటీ వినియోగం
- కేంద్రం ఇచ్చిన నిధులు, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతోనే ఈ ప్రగతి
- స్టీల్ ప్లాంట్ అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- త్వరలో 92.5 శాతం ఉత్పత్తి సాధించాలని అధికారులకు కొత్త లక్ష్యం
- ప్లాంట్ పురోగతిపై ప్రతి నెలా సమీక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశం

విశాఖ, అక్టోబరు6 (సందేశం టైమ్స్) : తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి, మనుగడ కోసం పోరాడుతున్న విశాఖ ఉక్కు కర్మాగారం (ఆర్ఐఎన్ఎల్) మళ్లీ ప్రగతి పథంలోకి దూసుకెళుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమష్టి కృషితో కేవలం ఏడాది వ్యవధిలోనే ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం అద్భుతంగా మెరుగుపడిందని తెలిపారు. గతేడాది సెప్టెంబర్‌లో కేవలం 25 శాతంగా ఉన్న కెపాసిటీ వినియోగం, ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి ఏకంగా 79 శాతానికి చేరుకోవడం ప్లాంట్ పునరుజ్జీవానికి సంకేతంగా నిలుస్తోందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు అమరావతి సచివాలయంలో స్టీల్ ప్లాంట్ ఉన్నతాధికారులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడానికి, దానిని బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో ఉంది. ఏడాది కాలంలో సాధించిన ఈ ప్రగతి ఎంతో సంతోషాన్నిచ్చే విషయం" అని అన్నారు. ప్లాంట్‌ను నష్టాల నుంచి గట్టెక్కించి, లాభాల బాట పట్టించాలంటే యాజమాన్యం, కార్మికులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకుని, ప్లాంట్ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. ఈ ప్రయత్నాల ఫలితంగా కేంద్రం రూ.11,440 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. ఈ నిధులలో మెజారిటీ మొత్తం ఇప్పటికే విడుదల కావడంతో, వాటిని వినియోగించి ప్లాంట్‌ను తిరిగి గాడిన పెట్టే పనులు వేగవంతమయ్యాయి. కేంద్రం నుంచి అందిన ఆర్థిక చేయూతకు, రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలు అందిస్తున్న సహకారం తోడవడంతో ఉత్పత్తిలో గణనీయమైన పురోగతి సాధ్యమైందని అధికారులు సీఎంకు వివరించారు.సాధించిన ప్రగతిని అభినందించిన ముఖ్యమంత్రి, భవిష్యత్ లక్ష్యాలపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. "ప్రస్తుతం 79 శాతానికి చేరిన ఉత్పత్తి సామర్థ్యాన్ని మూడో త్రైమాసికం ముగిసేలోగా 92.5 శాతానికి తీసుకెళ్లాలి. దీని కోసం అందరూ ఐక్యంగా కృషి చేయాలి" అని సూచించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ తిరిగి పూర్వ వైభవం సంతరించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

## గోపాలగౌడ ఇచ్చిన తీర్పులు చారిత్రాత్మకం: పవన్ కల్యాణ్




కర్ణాటకలో జస్టిస్ గోపాల గౌడ అమృత మహోత్సవం వేడుకలకు హాజరైన పవన్ కల్యాణ్ రాజకీయాల్లో ఓడినప్పుడు తన భుజం తట్టి ధైర్యం చెప్పారని వెల్లడి జనసేన సిద్ధాంతాలకు గౌడ బలమైన మద్దతుదారుడన్న పవన్ నల్లమల, భూసేకరణ పోరాటాల్లో ఆయన దిశానిర్దేశం చేశారని కితాబు

చింతామణి,అక్టోబరు6 (సందేశం టైమ్స్) : సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి వి.గోపాలగౌడ మట్టి వాసనలు తెలిసిన రైతుబిడ్డ అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. డబ్బు కోసం కాకుండా సగటు ప్రజలకు న్యాయం చేసేందుకు గోపాలగౌడ వచ్చారని ఉద్ఘాటించారు. తన వృత్తి జీవితాన్ని కార్మికులు, కర్షకుల కోసం అంకితం చేశారని ప్రశంసించారు. ఎన్నో కీలక కేసుల్లో గోపాలగౌడ ఇచ్చిన తీర్పులు చారిత్రాత్మకమని ఉద్ఘాటించారు. (సోమవారం) కర్ణాటక రాష్ట్రంలోని చింతామణిలో పవన్ కల్యాణ్ పర్యటించారు.

గోపాలగౌడ నిదర్శనం..

గోపాల గౌడ 75వ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు పవన్. గోపాలగౌడ రాసిన పుస్తకాన్ని పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. పవన్‌ని చూడటానికి భారీగా తరలివచ్చారు అభిమానులు, ప్రజలు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య, ప్రసిద్ధ కవి కుప్పలి వెంకటప్పను గుర్తు చేసుకున్నారు పవన్ కల్యాణ్. ఈ సందర్భగా ఆయన ప్రసంగించారు. పదవిలో ఉన్నప్పుడు ఎలా ఉండాలి, పదవి తర్వాత ఎవరి కోసం జీవించాలో గోపాలగౌడ ప్రత్యక్ష నిదర్శనమని కొనియాడారు. భూ సేకరణ చట్టంతో ఇబ్బందులు పడే వారి పక్షాన గోపాలగౌడ నిలిచారని ప్రశంసించారు. ఏ ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనలు చేసినా ఎదురు నిలిచారని చెప్పుకొచ్చారు. జనసేన చేపట్టిన పోరాటాల్లో గౌపాలగౌడ ఇచ్చిన సలహాలు ఎంతో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు పవన్ కల్యాణ్.

## ఏపీలో మరిన్ని పెట్టుబడులు పెట్టే అంశాన్ని పరిశీలించండి: టాటా గ్రూప్ చైర్మన్ తో మంత్రి లోకేశ్



ముంబయిలో టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌తో మంత్రి నారా లోకేశ్ సమావేశం
ఐటీ, ఈవీ, ఏరోస్పేస్, పునరుత్పాదక ఇంధన రంగాల్లో పెట్టుబడులకు ఆహ్వానం
విశాఖ, శ్రీసిటీ, మచిలీపట్నంలలో యూనిట్ల ఏర్పాటుకు కీలక ప్రతిపాదనలు
అవసరమైన భూమి, ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రభుత్వ హామీ
విశాఖ టీసీఎస్ కేంద్రం ప్రారంభోత్సవానికి రావాలని చంద్రశేఖరన్‌కు విజ్ఞప్తి
విశాఖలో ఏఐ రెడీ డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని కోరిన లోకేశ్

అమరావతి: అక్టోబరు6(సందేశం టైమ్స్) ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ నేడు ముంబయిలో టాటా గ్రూప్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను వివరిస్తూ, పలు రంగాల్లో టాటా గ్రూప్ భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. ఏపీలో మరిన్ని పెట్టుబడులు పెట్టే అంశాన్ని పరిశీలించండి అని విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో టాటా గ్రూప్‌కు చెందిన వివిధ కంపెనీల సీఈవోలు, ఎండీలు కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా, ఈ నెలలో విశాఖపట్నంలో జరగనున్న టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని చంద్రశేఖరన్‌ను మంత్రి లోకేశ్ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం రాష్ట్రంలో టాటా గ్రూప్ చేపట్టగల ప్రాజెక్టులపై రంగాలవారీగా సమగ్ర ప్రతిపాదనలు ఆయన ముందుంచారు.ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాలపై ప్రధాన దృష్టి విశాఖపట్నాన్ని తూర్పు తీరంలో కీలక కేంద్రంగా అభివృద్ధి చేసే ప్రణాళికలో భాగంగా, అక్కడ టాటా ఎల్క్సీ రీజనల్ ఆఫీస్ లేదా ఇంజనీరింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని లోకేశ్ ప్రతిపాదించారు. అలాగే, సాఫ్ట్‌వేర్ డిఫైండ్ వెహికల్స్ , ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత టెక్నాలజీ, ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ టెక్నాలజీ వంటి అధునాతన రంగాలలో ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. మరో కీలక ప్రతిపాదనగా, టాటా ఎలక్ట్రానిక్స్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో (అవుట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్) యూనిట్‌ను స్థాపించే అవకాశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు అవసరమైన భూమిని ప్రభుత్వమే ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ మాన్యుఫాక్చరింగ్ పాలసీ కింద కేటాయిస్తుందని హామీ ఇచ్చారు.

## టమోటా రైతులను ఆదుకుంటాం..

## ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి



అమరావతి: అక్టోబరు6 (సందేశం టైమ్స్) : టమోటా రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. రాప్తాడు మార్కెట్ లో ఆదివారం టమోటా ధరలు గరిష్టంగా రూ.18, కనిష్ఠంగా రూ.9, మోడల్ ధర రూ.12 గా ఉన్నాయి. టమోటా రేటు భారీగా పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో వారిని ఆదుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు.వర్షాల కారణంగా తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలకు టమోటా ఎగుమతి తగ్గిందని, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో టమాటా అమ్మకాలు మందగించాయని అచ్చెన్న పేర్కొన్నారు. పత్తికొండ మార్కెట్‌కు 30 నుంచి 40 మెట్రిక్ టన్నులకు మించి టమోటా రాదని, దసరా సెలవులు కావడంతో మరొక 10 టన్నులు అదనంగా వచ్చిందని అన్నారు. ఇప్పటివరకు 10 మెట్రిక్ టన్నుల టమోటాలను వివిధ రైతు బజార్లకు పంపించామన్నారు. పత్తికొండ మార్కెట్‌లో టమోటాలు సేకరించి చిత్తూరు ప్రాసెసింగ్ యూనిట్‌కి 10 మెట్రిక్ టన్నులు, రైతు బజార్లకు 15 మెట్రిక్ టన్నులు పంపిస్తామన్నారు.

## సమాజంలో జ్ఞాన జ్యోతిని వెలిగిస్తున్నది బ్రాహ్మణులే: ఢిల్లీ సీఎం రేఖా గుప్తా

శాస్త్రాలతో పాటు శస్త్రాలను కూడా బ్రాహ్మణులు పూజిస్తారన్న రేఖా గుప్తా
బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రతి ప్రభుత్వం పాటుపడాలని వ్యాఖ్య
27 ఏళ్లుగా ఢిల్లీ అభివృద్ధి చాలా నెమ్మదిగా సాగిందన్న రేఖ



అమరావతి: అక్టోబరు6 (సందేశం టైమ్స్) : సమాజంలో విజ్ఞాన జ్యోతిని వెలిగిస్తున్నది బ్రాహ్మణులేనని, వారి సంక్షేమం కోసం ప్రతి ప్రభుత్వం పనిచేయాలని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా అన్నారు. ఢిల్లీలోని పీతంపురలో శ్రీ బ్రాహ్మణ సభ నిర్వహించిన అఖిల భారత బ్రాహ్మణ మహాసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రేఖా గుప్తా మాట్లాడుతూ, "సమాజంలో ఎవరైనా విజ్ఞాన దీపాలను వెలిగిస్తున్నారంటే అది మన బ్రాహ్మణ సమాజమే. వారు శాస్త్రాలనే కాదు, శస్త్రాలను కూడా పూజిస్తారు. నేటి సమాజాన్ని, దేశాన్ని కాపాడాలంటే శాస్త్ర, శస్త్రాలు రెండూ ఎంతో అవసరం" అని పేర్కొన్నారు. బ్రాహ్మణులు ఎల్లప్పుడూ జ్ఞానాన్ని పంచుతూ, ధర్మాన్ని ప్రచారం చేస్తూ, మంచిని పెంచుతూ సమాజ హితం కోసం పాటుపడ్డారని ఆమె కొనియాడారు. "ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, బ్రాహ్మణులను ముందుకు తీసుకెళ్లేందుకు వారి సంక్షేమానికి కట్టుబడి ఉండాలి" అని ఆమె అభిప్రాయపడ్డారు.

## సుప్రీం కోర్టులో తెలంగాణ సర్కారుకు ఊరట

న్యూఢిల్లీ (సందేశం టైమ్స్) : తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం కోర్టులో ఊరట దక్కింది. తెలంగాణ స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను సవాల్ చేస్తూ వంగ గోపాల్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం ధర్మాసనం డిస్మిస్ చేసింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉండటంతో విచారణను స్వీకరించలేమని కోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు స్టే ఇవ్వకపోవడంతో సుప్రీం కోర్టుకు వచ్చినట్లు పిటిషనర్ తెలిపారు. స్టే ఇవ్వకపోతే సుప్రీం కోర్టుకు వచ్చేస్తారా ? అని న్యాయస్థానం ప్రశ్నించింది. ఈ క్రమంలో జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం పిటిషన్‌ను కొట్టేసింది.

## విశాఖకు శివాలిక్ నౌక..

## స్వాగతం పలికిన కేంద్రమంత్రి సోనోవాల్

విశాఖపట్నం,అక్టోబరు6(సందేశం టైమ్స్) : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఆయన పేర్కొన్నారు. షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌సీఐ) యాజమాన్యం కిందకు వచ్చిన వీఎల్‌జీసీ(శివాలిక్) నౌక తొలిసారిగా దేశంలోని విశాఖపట్నం పోర్టుకు చేరుకుంది. శివాలిక్ నౌకకు సర్బానంద సోనోవాల్ విశాఖ సముద్రంలో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

# ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

## పి ప్రావీణ్యజిల్లా కలెక్టర్

- జడ్పీటిసి, ఎంపీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు శిక్షణ
- మాస్టర్ ట్రైనర్ లతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ,
- ఎన్నికల నిర్వహణపై సమగ్ర అవగాహన






సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 6అక్టోబర్: ఎన్నికల విధుల పట్ల పరిపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నోడల్ అధికారులు, జిల్లాలోని సబ్ కలెక్టర్ , ఆర్డీవోలు, జడ్పీ టీసీ ఆర్ ఓలు , ఎంపిటిసి ఆర్ ఓ లు , క్లస్టర్ అధి కారులు ,డి ఎల్ పి ఓ లు ఎంపీడీవోలు ,తాసిల్దార్ లు, ఎంపీఓల కు ఎన్నికల నిర్వహణపై మాస్టర్ ట్రైనర్లతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య మాట్లాడారు ం ఎన్నికల విధుల పట్ల పరిపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, సమర్ధవంతంగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారులు ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఎం.పీ.టీ.సీ, జెడ్.పీ.టీ.సీ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియమ, నిబంధనలపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకో వాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను ఎంతో జాగ్రత్తగా, పూర్తి పారదర్శకంగా నిర్వర్తించాలని హితవు పలికారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటనను అనుసరిస్తూ జిల్లాలో ఎంపీటీసీ జడ్పీటిసి ఎన్నికలు రెండో విడతల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ఆయా మండలాల మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాలలో, జడ్పీటిసి సభ్యుల నామినేషన్ల స్వీకరణ జిల్లా పరిషత్ కార్యాలయంలో స్వీకరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. నామినేషన్ల స్వీకరణ నుండి అభ్యర్థుల తుది జాబితా ప్రకటన వరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణలో ఎన్నికల రిటర్నింగ్ అధికారుల పాత్ర ఎంతో ప్రాముఖ్యతతో కూడుకున్నదన్నారు. ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన ఎన్నికల నిబంధనల మేరకు అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరణ స్క్రూటీని,విత్ డ్రా, గుర్తుల కేటాయింపు ప్రక్రియ తో పాటు ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేలా చూడాలన్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని, సమయ పాలనను పక్కాగా పాటించాలన్నారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులతో పాటు వారి ప్రతిపాదకులు స్థానికులేనా అన్నది ఓటరు జాబితా ఆధారంగా నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. అభ్యర్థి సహా ముగ్గురిని మాత్రమే లోనికి అనుమతిం చాలని అన్నారు. నామినేషన్ల ఉపసంహరణ కోసం అభ్యర్థులు కాకుండా, వారి తరపున ప్రతిపాదకులు వచ్చిన సమయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే ఉ పసంహరణకు అనుమతించాలని కలెక్టర్ సూచిం చారు. ఎన్నికలలో పోటీలో నిలబడే అభ్యర్థులు ప్రత్యేక బ్యాంకు అకౌంట్ ఖాతా ఎన్నికల నామినేషన్ల సమయంలో ఇవ్వాలని ఎన్నికల ఖర్చులు మొత్తం ఈ ఖాతా నుండే నిర్వహించాలని అన్నారు. ఎన్నికల్లో పోటీల్లో ఉండే అభ్యర్థులపై వచ్చే పెయిడ్ ఆర్టికల్ వార్తలను ఎన్నికల సిబ్బంది సేకరించాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల నియమ నిబంధనలపై అధికారులు అవగాహన కల్పించాలని నిబంధనల ప్రకారం అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారులకు నోడల్ అధికారులకు మండల స్థాయి అధికారులకు కలెక్టర్ సూచిం చారు. బ్యాలెట్ పేపర్ లో అభ్యర్థుల పేర్లను తెలుగు అక్షర క్రమం ఆధారంగా వరుసగా ముద్రించాల్సి ఉంటుందని అన్నారు. అభ్యర్థులు ఎన్ని సెట్ల నామినేషన్లు సమర్పిస్తే, అన్ని నామినేషన్ల దరఖాస్తులను తప్పనిసరిగా పరిశీలించాలని, వాటిలో ఎన్ని ఆమోదించబడ్డాయి, ఎన్ని తిరస్కరణకు గురయ్యాయి, అందుకు గల కారణాలు ఏమిటీ అనే అంశాలను వెల్లడించాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్లను నిబంధనలకు అనుగుణంగా సరైన పద్ధతిలో సమర్పించేలా అభ్యర్థులకు సహకారం అందించేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆర్.ఓ, ఏ.ఆర్.ఓల సందేహాలను నివృత్తి చేసేందుకు వీలుగా జెడ్పీ సీ.ఈ.ఓ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నోటిఫికేషన్ జారీ చేయడానికి ముందే మాక్ నామినేషన్ ప్రక్రియను నిర్వహించుకోవాలని, దీనివల్ల ఎన్నికల నిర్వహణలో తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్త పడవచ్చని హితవు పలికారు. నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుండి ప్రతి రోజు త్వరితగతిన డైలీ రిపోర్టును పంపించాలని, సంబంధిత వెబ్ సైట్లో అభ్యర్థుల నామినేషన్ పత్రాలను స్కాన్ చేసి అప్లోడ్ చేయాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ చివరి సమయంలో, విత్ డ్రా సమయాల్లో వీడియో చిత్రీకరణ చేయిస్తే, అవి తగిన ఆధారాలుగా ఉపయోగపడతాయని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా పక్కాగా జరిగితే, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు సజావుగా జరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, స్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను సమర్ధవంతంగా నిర్వహించాలని ఆర్.ఓలు, సహాయ ఆర్.ఓలకు కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, ఏమాత్రం సంకోచించకుండా పై అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఏ దశలోనూ సొంత నిర్ణయాలు తీసుకోకుండా, రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వర్తిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను సాఫీగా పూర్తి చేయాలని ,ఓటర్లను ప్రభావితం చేసే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎన్నిక ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా అమలు చేయాలని అన్నారు.

**ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి : పరితోష్ పంకజ్, జిల్లా ఎస్పీ**

స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుతో పాటు బ్యాలెట్ బాక్సులు పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాల నుండి పోలింగ్ కేంద్రాల వరకు తరలింపు ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్స్ లను స్ట్రాంగ్ రూములకు తరలింపు స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత ఏర్పాట్లు కు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు రూట్ల వారీగా సిబ్బంది ని నియమించి ప్రశాంత వాతావరణంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ,జడ్పీసీఈఓ జానకిరెడ్డి , నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి , డి పి ఓ సాయి బాబా , ఆర్ ఓ లు , ఎంపీడీవోలు ,తాసిల్దార్ లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు ,

## ఆవుల రాజిరెడ్డిని కలిసిన

# కాంగ్రెస్ నాయకులు



సందేశం టైమ్స్: సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి అక్టోబర్ 06: నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి ని కాంగ్రెస్ నాయకులు కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం మాసాయిపేటలో రాజిరెడ్డిని కలిసి కౌడిపల్లి మండలం రాజిపేట కు చెందిన కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు కాశమ్మ వెంకటేశం గౌడ్, కాంగ్రెస్ నాయకుడు కొల్చెల్మ శ్రీకాంత్, అరవింద్, లింగంపల్లి కి చెందిన కాంగ్రెస్ నాయకులు పరంలాల్, గొల్ల కిష్టయ్య, గొల్ల కొమురయ్య, సంజీవరెడ్డి, పెంట్యా, గోపి, మాణిక్య రెడ్డి, ప్రవీణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికై

# “ప్రజావాణి” కార్యక్రమం






సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 6అక్టోబర్: సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రజల సమస్యల పరిష్కారానికి నాంది పలికేలా “ప్రజావాణి” కార్యక్రమం సోమవారం విజయవంతంగా నిర్వహించబడింది. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపిఎస్ ఈ కార్యక్రమంలో పాల్గొని, వివిధ మండలాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి పలు సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎస్పీ ఫిర్యాదులను ఓపికగా విని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత ఎస్‌హెచ్ఓలకు ఆదేశాలు జారీ చేశారు. సమస్యలు ఆలస్యమవుతున్న సందర్భాల్లో ఫోన్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. చట్ట అమలులో ఎలాంటి అలసత్వం కనిపించకూడదని, ప్రతి కేసును పారదర్శకంగా విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు.స్థానిక పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులకు పరిష్కారం లభించని సందర్భాల్లో, మధ్యవర్తుల జోక్యం లేకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఎస్పీ సూచించారు. ఈ విధంగా ప్రజల న్యాయహక్కులను పరిరక్షించడంలో ప్రజావాణి కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తున్నదని అన్నారు.పోలీసు శాఖ ప్రజలకు మరింత చేరువయ్యేలా, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకునేలా ఈ కార్యక్రమం కొనసాగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజల సమస్యలను చట్టపరంగా పరిష్కరించి, సత్వర న్యాయం అందించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు

# సంపాదకీయం

## నటులు కులదైవాలా

ఇద్దరు సినిమా వాళ్ల మధ్య ఎప్పటి నుంచో ఉన్న వైషమ్యాల నేపథ్యంలో శాసనసభలో చోటుచేసుకున్న ఒక సంఘటన... ఆంధ్రప్రదేశ్‌లో మరో సమస్యే లేనట్టుగా అదే ప్రధాన సమస్యగా మారడమేమిటి? శాసనసభలో చోటుచేసుకున్న సంభాషణలను రికార్డుల నుంచి తొలగించినా అదే అంశాన్ని పట్టుకొని వేలాడటమేమిటి? హవ్వ... నవ్విపోదురుగాక! ఈ ఎపిసోడ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పరిస్థితి చూస్తే జాలేస్తుంది. కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం అన్నట్టుగా ఆయన నలిగిపోతున్నారు. ఈ మొత్తం వ్యవహారాన్ని విడిగా చూడలేం. ఆంధ్రప్రదేశ్‌ను పట్టి పీడిస్తున్న కుల జాఢ్యం వల్ల సమస్య కానిది కూడా సమస్యగా మారుతోంది. నిజానికి శాసనసభలో ఆ రోజు తెలుగుదేశం సభ్యుడు నందమూరి బాలకృష్ణ అన్న మాటలను కాదు %-% నిండు సభలో ఆయన ప్రవర్తించిన తీరును తప్పు పట్టాలి. బాలకృష్ణ శాసనసభకు ఎన్నికవడం ఇది మొదటిసారి కాదు. మూడో పర్యాయం. సభ మర్యాదల గురించి ఆయనకు తెలియదని అనుకోగలమా? చలువ కళ్లద్దాలను తలపైకి నెట్టి, రెండు జేబులలో చేతులు పెట్టుకొని ఆయన మాట్లాడటం సభా మర్యాదలను ఉల్లంఘించడమే! ఒకప్పుడు సభ్యుడు ఎవరైనా ఇలా ప్రవర్తించి ఉంటే సభాపతి తీవ్రంగా మందలించి ఉండేవారు. గతంలో సభ్యులు సభలో వార్తా పత్రికలు చదవడాన్ని కూడా సభాపతులు అనుమతించేవారు కాదు. ఇప్పుడా మర్యాదలు, సంప్రదాయాలు గాలికి పోయాయి. ఎన్టీఆర్ అంతటి వారు కూడా తను వాడిన మాటలకు సభలో ఇబ్బంది పడాల్సి వచ్చింది. చివరకు శాసనసభను బహిష్కరించాల్సిన తీవ్ర నిర్ణయాన్ని అప్పుడు ఆయన తీసుకున్నారు. ఆ రోజు కాంగ్రెస్ సభ్యురాలు నన్నపనేని రాజకుమారి ఎన్టీఆర్‌ను విమర్శిస్తూ ఒక కాగితం చూపించారు. 1983లో తన పార్టీ తరఫున తొలిసారి నెగ్గి ఎమ్మెల్యే అయిన రాజకుమారి సభలో తనను విమర్శించడాన్ని జీర్ణించుకోలేని ఎన్టీఆర్ 'ఆ కాగితాన్ని మడిచి...' అని ఇంకేదో అన్నారు. అంతే, అధికార కాంగ్రెస్ సభ్యులు ఆయనపై విరుచుకుపడ్డారు. క్షమాపణలు చెప్పాలని కోరారు. దీంతో అహం దెబ్బతిన్న ఎన్టీఆర్ విసవిసా నడుచుకుంటూ సభాపతి స్థానం వద్దకు వెళ్లి తన భుజంపై ఉన్న కండువాను పోడియంపై పెట్టి తన స్థానం వద్దకు వెళ్లి, తనకు జరిగిన అవమానానికి నిరసనగా శాసనసభను బహిష్కరిస్తున్నానని ప్రకటించి సభ నుంచి వెళ్లిపోయారు. నిజానికి ఎన్టీఆర్ అంత తీవ్ర నిర్ణయం తీసుకుంటారని తెలుగుదేశం పార్టీ వారెవరికీ తెలియదు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న ఎన్టీఆర్ సభకు హాజరు కాకూడదని నిర్ణయించుకోవడంతో చంద్రబాబు నాయుడే ప్రతిపక్ష నాయకుడి పాత్ర పోషించారు. ఇది గతం! సభలో పాటించవలసిన నియమాలు, సంప్రదాయాలకు అప్పట్లో అంత విలువ ఉండేది. కాలక్రమంలో సభాపతులు తమ పట్టు కోల్పోతూ వచ్చారు. ముఖ్యమంత్రుల కనుసన్నల్లో పనిచేయడానికి అలవాటుపడ్డారు. ఇప్పుడు అసలు విషయానికి వద్దాం! నందమూరి బాలకృష్ణ ఆ రోజు చిరంజీవిని ఏమన్నారో స్పష్టత లేదు. కానీ... మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత సభలో సభ్యుడైన జగన్మోహన్‌రెడ్డిని మాత్రం పరోక్షంగా సైకోగాడు అని బాలకృష్ణ వ్యాఖ్యానించారు. నిండు సభలో సహచర సభ్యుడిని సైకోగాడు అనడం, కళ్లజోడును తలపైకి నెట్టుకొని, జేబుల్లో చేతులు పెట్టుకొని మాట్లాడటం కచ్చితంగా అభ్యంతరకరమే. సభాపతి స్థానంలో ఉండిన ఉప సభాపతి రఘురామకృష్ణ రాజు కూడా దీనిపై అభ్యంతరం చెప్పకుండా మౌనంగా ఉండిపోయారు. సభా నాయకుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు అయినా చొరవ తీసుకొని బాలకృష్ణను సరిదిద్ది ఉండవలసింది. ఇవేమీ జరగకపోగా చిరంజీవిని ఉద్దేశించి బాలకృష్ణ అవమానకరంగా మాట్లాడినట్టుగా ప్రచారం జరిగింది. ఇంకేముందీ, కులాల కుంపట్లు రాజుకున్నాయి. మెగాస్టార్ చిరంజీవికి మద్దతుగా ఆయన అభిమానులు, బాలకృష్ణకు మద్దతుగా ఆయన అభిమానులు సోషల్ మీడియా వేదికగా రెచ్చిపోయారు. చిరంజీవి తరఫున మాట్లాడిన కొందరైతే ఆయనను ఏమైనా అంటే చంపేస్తామని హెచ్చరించేదాకా ఆవేశపడిపోయారు. కమ్మ%-%కాపు కులాల మధ్య కుంపట్లు రాజుకోవడంతో ఆ మంటల్లో చలి కాచుకొనే ప్రయత్నాన్ని వైసీపీ వాళ్లు చేశారు. రాష్ట్రంలో ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉంది. కూటమి ప్రభుత్వంలోనూ, కూటమిలోనూ తాము ఆరాధించే పవన్ కల్యాణ్‌ది ప్రధాన పాత్ర అయినందున కాపులు ఆక్రోశపడ్డారు. ప్రతిగా కమ్మవాళు కూడా స్పందించారు. ఈ రెండు కులాలనూ విడదీస్తే రాజకీయంగా లాభిస్తుందని భావించిన వైసీపీ నాయకులు తెర వెనుక నుంచి కాపులను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. సినిమా వేరు%-% రాజకీయం వేరు అన్నది మరుగున పడింది. ఆంధ్రప్రదేశ్‌లో చాలా కాలం నుంచి రాజకీయాలు, సినిమా కలగాపులగం అయ్యాయి. అదే సమయంలో అధికారం కోసం, ఆధిపత్యం కోసం మూడు కులాల మధ్య పోరాటం మొదలైంది. రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీపై రెడ్ల పార్టీగా ముద్రపడలేదు. కాకపోతే అధిక శాతం రెడ్లు ఆ పార్టీకి మద్దతు పలికేవారు. జగన్‌రెడ్డి సొంత పార్టీ పెట్టుకున్న తర్వాత రెడ్లు ఆయనను సొంతం చేసుకున్నారు. అదే సమయంలో మెజారిటీ క్రైస్తవులు కూడా జగన్‌ను తమ సొంతం అనుకున్నారు. తెలుగుదేశం పార్టీని ఎన్టీఆర్ స్థాపించిన నాటి నుంచి కమ్మ వాళ్లు ఆ పార్టీని తమ సొంత పార్టీగా భావించడం మొదలుపెట్టారు. పార్టీ నాయకత్వం చంద్రబాబు నాయుడి చేతుల్లోకి వచ్చిన తర్వాత ఆయన తనపై కుల ముద్ర పడకుండా జాగ్రత్త పడ్డారు. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి ప్రజారాజ్యం పార్టీని ప్రారంభించారు. అనుభవరాహిత్యంతోపాటు ఇతరత్రా కారణాల వల్ల

# ఏపీ ప్రజలకు అలర్ట్.. రానున్న మూడు గంటలు జాగ్రత్త...




అమరావతి: అక్టోబరు6 (సందేశం టైమ్స్):ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాలకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. రానున్న మూడు గంటల పాటు పలు జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరిక ఉన్నట్లు తెలిపింది. అలాగే పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు విజయనగరం, విశాఖ, అల్లూరి, అనకాపల్లి, కోనసీమ, గుంటూరు, పల్నాడు జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు.కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేస్తున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మోస్తరు వర్షంతోపాటు బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు చెప్పారు. పిడుగులు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు ఎవ్వరూ చెట్ల కింద ఉండరాదని సూచించారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. దూర ప్రయాణాలు రద్దు చేసుకుని, ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని వివరంచారు. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఎండీ ప్రఖర్ జైన్ కోరారు.

## భారీగా పతనమైన టమాటా ధర.. ధర్నాకు దిగిన రైతులు



కర్నూలు:అక్టోబరు6 (సందేశం టైమ్స్): పత్తికొండ మార్కెట్లో టమాటా ధరలు భారీగా పతనం అయ్యాయి. మార్కెట్‌లో కిలో టామాటా రూపాయి ధర పలుకుతుండటంతో.. రైతులు లబోదిబో అంటున్నారు. ధర లేకపోవడంతో టమాటాలను రోడ్లపై పారబోశారు అన్నదాతలు. అనంతరం టామాటా రైతులు ధర్నాకు దిగారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో మంత్రాలయం–బెంగళూరు రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.పండించిన పంటకు ధర నిర్ణయించే హక్కురైతున్నకు లేకపోవడంతో మార్కెట్‌లో దళారీలు చెప్పిన ధరకే రైతులు అమ్ముకోవాల్సి వస్తోంది. దీంతో రైతులకు ఈ కష్టాలు తప్పడం లేదు. కూరగాయల సాగు కలిసొస్తుందేమోనన్న ఆశతో సాగు చేసిన రైతులు.. టమాటా కోతకు వచ్చే సమయానికి మార్కెట్‌లో ధరలు పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి దళారులను, ధరలను నియంత్రణ చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు

## యారాడ బీచ్‌లో విషాదం.. సముద్రంలో కొట్టుకుపోయిన విదేశీయులు..

విశాఖ:అక్టోబరు6 (సందేశం టైమ్స్): యారాడ బీచ్ లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సముద్రంలో ఈతకు దిగిన నలుగురు విదేశీయులు నీటిలో కొట్టుకుపోయారు. లైఫ్ గాడ్స్ వీరిలో ఇద్దరిని రక్షించి ఒడ్డుకు తీసుకువచ్చారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. బయటకు తీసుకువచ్చిన వారికి లైఫ్ గాడ్స్ సీపీఆర్ చేశారు. ఇద్దరిలో ఓ వ్యక్తి సీపీఆర్ కారణంగా బతికాడు. మరో వ్యక్తి చనిపోయాడు. రెస్క్యూ సిబ్బంది సముద్రంలో గల్లంతైన వారి కోసం వెతుకుతున్నారు.ఇటలీకి చెందిన మొత్తం 16 మంది పర్యాటకులు యారాడ బీచ్ లో ఎంజాయ్ చేయడానికి వచ్చారు. అందరూ సముద్రంలో దిగి ఈత కొడుతూ ఉండగా అలల ధాటికి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కాగా, యారాడ బీచ్ లో తరచుగా ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటూ ఉన్నాయి. ఈత కోసం సముద్రంలోకి వెళ్లిన చాలా మంది గల్లంతై ప్రాణాలు కోల్పోయారు. గత సంవత్సరం సెప్టెంబర్ నెలలోనూ 8మంది ఇటలీ పర్యాటకులు సముద్రంలో కొట్టుకుపోయారు. లైఫ్ గార్డ్స్ సకాలంలో స్పందించటంతో అందరూ క్షేమంగా బయటపడ్డారు. మరో ఘటనలో..మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌లో విజయవాడకు చెందిన ఎం ప్రవీణ్ గల్లంతయ్యాడు. స్నానం చేస్తుండగా అలలు ఎగసిపడటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు, మెరైన్ పోలీసులు రంగంలోకి దిగి ప్రవీణ్ కోసం గాలిస్తున్నారు.

# కడప జిల్లాలో అమానుషం.. కన్నతల్లిని దారుణంగా..




కడప, అక్టోబరు6 (సందేశం టైమ్స్):కడప జిల్లాలో నిప్రొద్దుటూరు శ్రీరామ్ నగర్‌లో దారుణం ఘటన వెలుగులోకి వచ్చింది. కన్నతల్లి లక్ష్మీదేవిని కొడుకు యశ్వంత్ రెడ్డి హత్య చేశాడు. యశ్వంత్ రెడ్డికి కొన్నేళ్లుగా మానసిక స్థితి సరిగా లేదు. ఈ క్రమంలో తనను తల్లి తిట్టిందని కూరగాయల కత్తితో గొంతుకోసి యశ్వంత్ రెడ్డి హత్యచేశాడు. వంటింట్లో లక్ష్మీదేవి ఉండగా ఆమెతో గొడవ పడ్డాడు యశ్వంత్ రెడ్డి. కత్తితో విచక్షణ రహితంగా దాడి చేసి హత్య చేశాడు. వంటింట్లో రక్తపు మడుగులో పడి ఉన్న తల్లిని అలాగే ఈడ్చుకుంటూ ఇంటి బయట పడేశాడు యశ్వంత్ రెడ్డి. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది.తల్లి లక్ష్మీదేవి ఈశ్వర్‌రెడ్డి నగర్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. నిందితుడు యశ్వంత్ రెడ్డి బీటెక్ పూర్తి చేసి, ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. తల్లిని హత్య చేసే సమయంలో తండ్రి విజయ భాస్కర్‌ని గదిలో బంధించాడు యశ్వంత్ రెడ్డి. తాను దుస్తులు మార్చుకోడానికి గదిలోకి వెళ్లగా బయట నుంచి తలుపుకి గడియ పెట్టాడు. అనంతరం వంట గదిలోకి వెళ్లి తన భార్య లక్ష్మిదేవిని అత్యంత దారుణంగా తన కుమారుడు యశ్వంత్ రెడ్డి హత్య చేశారని కన్నీరు మున్నీరుగా విలపించాడు విజయ భాస్కర్. ఈ ఘటనపై విజయ భాస్కర్ పోలీసులకు సమాచారం అందజేశారు. ఫిర్యాదు మేరకు నిందితుడు యశ్వంత్ రెడ్డిని అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు కడప జిల్లా పోలీసులు.

# 'దీపావళి'.. ఈ పేరుతో ఓ ఊరుంది..

అక్టోబరు6 (సందేశం టైమ్స్):దసరా', 'దీపావళి' పండగలని తెలుసు. దేశవ్యాప్తంగా కొన్ని ఊర్ల పేర్లు గమ్మత్తుగా ఉన్నట్టే... ఆశ్చర్యంగా ఒక ఊరి పేరు 'దీపావళి'. అది కూడా ఎక్కడో కాదు... మన దగ్గరే. దేశవ్యాప్తంగా ఈ పేరుతో ఉన్న ఒకే ఒక్క ఊరు అది... ఇంతకీ ఎక్కడుంది? ఏమా కథ??%భారతదేశంలోనే 'దీపావళి' అని పిలిచే ఒకే ఒక్క గ్రామం... శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి 7 కిలోమీటర్ల దూరంలోని గార మండలం, గొంటి మేజర్ పంచాయితీలో ఉంది. ఆ ఊరి జనాభా 1,181. అందరూ వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తారు. వంశధార, నాగావళి నదుల నుంచి సాగునీరు అందుబాటులో ఉండటం వల్ల అన్ని రకాల పంటలు పుష్కలంగా పండిస్తారు.

పేరు వెనుక పురాణగాథ...

"ఈ గ్రామం పేరు వెనుక గొప్ప పురాణం ఉంది. శతాబ్దాల క్రితం... ఈ ప్రాంతాన్ని పాలించిన సిక్కోలు రాజు అత్యంత భక్తిపరుడు. ప్రజలకు ఏ కష్టం రాకుండా చూసుకునేవాడు. ప్రతీ ఉదయం గుర్రం మీద శ్రీకాకుళం నుండి శ్రీకూర్మం మీదుగా కళింగ పట్నం వెళ్లి తిరిగి వస్తుండేవాడు. ఆ క్రమంలో ఒకరోజు ఈ ప్రాంతంలోని పవిత్రమైన శ్రీ కూర్మనాథ స్వామి ఆలయాన్ని సందర్శించి తిరిగి వస్తుండగా... మా గ్రామంలో చీకటిపడుతున్న వేళ స్పృహ తప్పి పడిపోయాడు. అలాంటి పరిస్థితుల్లో ఇక్కడి రైతు కూలీలు, భక్తులు వచ్చి... నూనె దీపాలతో ఆయన చుట్టు చేరి, సపర్యలు చేసి, మంచినీళ్ల ముఖంపై చిలకరించడంతో రాజు స్పృహలోకి వచ్చి, లేచి కూర్చున్నాడు. తన కోసం ప్రజలు చూపిన అభిమానానికి ఆయన పొంగిపోయాడు. అందుకు కృతజ్ఞతగా, రాజు ఇలా ప్రకటించాడు, 'మీరు దీపాల వెలుగులో నాకు ఊపిరి పోశారు. ఈ రోజు నుంచి మీ గ్రామాన్ని దీపావళి అని పిలుచుకుందాం' అన్నారట. ఆ విధంగా, ఈ గ్రామం 'దీపావళి' పేరుతో ప్రాచుర్యంలోకి వచ్చింది" అని వివరించారు శ్రీకాకుళానికి చెందిన ఏస్ (అగ్రి బిజినెస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) ఎన్జీఓ ఛైర్మన్, అగ్రి సైంటిస్ట్ డా.ఎస్.వి.ఎస్.ఆర్.కె నేతాజీ. సాధారణంగా సంక్రాంతి పండగకు అల్లుళ్లకు మర్యాదలు చేస్తారు. కానీ ఈ ఊరిలో మాత్రం 'దీపావళి'కి కూడా అల్లుళ్లకు మర్యాదలు, ప్రత్యేక ఆచారాలు విందులు, వినోదాలు, కుటుంబ సమేతంగా భోజనాలు చేయడం, మిఠాయిలు ఇచ్చిపుచ్చుకోవడం వంటి సరదాలతో మహా సందడిగా ఉంటుంది.

%రాజును తలుచుకుంటూ దీపాలు...

"ఎవరైనా మీదే ఊరు అంటే... 'దీపావళి' అని చెప్పుకోవడం మాకు గర్వంగా ఉంటుంది. అప్పుడెప్పుడో రాజుగారు పేరు పెట్టినప్పటి నుంచి ఇప్పటి దాకా... రెవెన్యూ రికార్డుల్లో మా గ్రామం 'దీపావళి'గానే నమోదు అయింది. ఇక్కడ అన్ని పండుగలు ఘనంగా జరుపుకొంటారు. సంక్రాంతికి పెద్దలను తలుచుకుంటూ భోజనాలు పెట్టుకోవడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా ఉన్న సంప్రదాయం. మా ఊరిలో సంక్రాంతి పండుగతో పాటు దీపావళికి కూడా పెద్దలకు కొత్త దుస్తులు, భోజనాలు పెట్టడం విశేషం. ఇక్కడ పాడిపంటలకు లోటులేదు. వరి, జొన్నలు అన్ని రకాల కూరగాయలు పండించుకుంటాం. అయితే తాగునీటికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. మాకు సమీపంలో శాలిగుండం తాగునీటి ప్రాజెక్టు ఉన్నప్పటికీ... మా గ్రామస్తులకు సరిపడా రక్షిత మంచినీరు అందటం లేదు. ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉంది' అంటున్నారు 'దీపావళి' గ్రామ సర్పంచ్




చల్ల శ్రీనివాసరావు. ఈయన గత 24 ఏళ్లుగా ఈ గ్రామానికి సర్పంచ్‌గా సేవలందిస్తున్నారు. పేరుకు తగ్గట్టే 'దీపావళి' సందర్భంగా గ్రామం మొత్తం రాత్రి సమయంలో వేల దీపాలతో దేదీవ్యమానంగా వెలిగిపోతుంది. రంగోలీ డిజైన్‌లతో వీధులు, ఇళ్లు కళకళలాడుతుంటాయి. ఊరి చరిత్రను, రాజును తలుచు కుంటూ దీపాల వెలుగులో ఊరేగింపు, శ్రీ కూర్మనా?థ ఆలయంలో ప్రత్యేక పూజలు జరుపుతారు. అందరికీ శుభాలు జరగాలని భక్తిశ్రద్ధలతో గ్రామస్తులంతా పూజలు, నైవేద్యాలు సమర్పిస్తారు.ఒక రాజు గొంతులో నీళ్లు పోసి కాపాడిన గొప్ప చరిత్ర ఈ గ్రామానిది. అలాంటి ప్రజల వారసులు ఇప్పుడు తాగునీటి సమస్యను ఎదుర్కోవడం విచిత్రం.

# మధ్యాహ్నామైన వెలుగుతున్న వీధి దీపాలు



సంధవరం అక్టోబరు6 (సందేశం టైమ్స్): గ్రామంలో వీధి దీపాలు మధ్యాహ్నామైన వెలుగుతూనే ఉన్నాయి. వాటి గురించి అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలో విద్యుత్ ఆదా చర్యలు చేపట్టాలని మండల ఉన్నత అధికారులు పలు సమావేశాలలో ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఉన్నతాధికారుల మాటలను పంచాయతీ అధికారులు గాలికి వదిలేస్తున్నారు. చాలా సందర్భాలలో వీధి దీపాలు రోజంతా వెలుగుతున్నాయని, దీనివలన విద్యుత్ వృధా అవుతుందని ప్రజలు తెలిపారు. వృధా అయిన విద్యుత్ భారాన్ని ప్రభుత్వం పేద ప్రజలపై మోపుతారని మండిపడుతున్నారు. ప్రజలకు విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించాల్సిన వారే విద్యుత్ వృధాకు కారణం కావటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. వీధి దీపాల టైమింగ్ సరిచేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ సమస్యపై చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# అర్ధరాత్రి హైవేపై ప్రమాదం

## లారీ కేబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

## సురక్షితంగా బయటకు తీసిన అంబులెన్స్ సిబ్బంది



నరసన్నపేట,అక్టోబరు6 (సందేశం టైమ్స్):దేవాది గ్రామం జాతీయ రహదారిపై అర్ధరాత్రి రెండు గంటల సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది. నేషన్ హైవే సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా నుంచి విశాఖ వైపు వెళ్తున్న భారీ ట్రక్కు (లారీ) ను టీ తాగేందుకు హైవే పక్కనే డ్రైవర్ నిలుపుదల చేశారు. అదే కంపెనీకి చెందిన మరో భారీ ట్రక్కు వెనుక నుంచి వస్తూ ఆగి ఉన్న ట్రక్కును ఢీకొట్టా డు. ఈ ప్రమాదంలో ఢీకొన్న ట్రక్కు డ్రైవర్ బబుల్ సింగ్ స్టీరింగ్ మధ్య కేబిన్‌లో ఇరుక్కొని ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుండగా.. ముందు ట్రక్కు డ్రైవర్ నేషనల్ హైవే సిబ్బందికి సమాచారం అందించాడు. వెంటనే హైవే సిబ్బంది అక్కడికి చేరుకొని స్టీరింగ్ మధ్యలో ఇరుక్కున్న డ్రైవర్‌ను మరికొంతమంది లారీ డ్రైవర్ల సాయంతో బయటకు తీశారు. అతడిని వెంటనే చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. హైవే అంబులెన్స్ సిబ్బంది సకాలంలో చేరడంతో డ్రైవర్‌ను ప్రాణాలతో కాపాడడం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

# పేద విద్యార్థికి ఆర్థిక సాయం



ఆదోని :అక్టోబరు6 (సందేశం టైమ్స్): ఉన్నత చదువులు చదివేందుకు ఆర్థిక స్తోమత లేని పేద విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సైఫుల్ల, కార్యదర్శి మేఘనాథ్ రెడ్డిలు తెలిపారు. చిన్మయ విద్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పట్టణానికి చెందిన నాగరాజు, రేణుకల సంతానమైన ఇందు అనే అమ్మాయి ఉచిత ఎంబిబిఎస్ సీటు సాధించి అడ్మిషన్ ఫీజుల కొరకు రోటరీ క్లబ్ తరపున రూ.16,750. బీటెక్ చదివేందుకు, రంగముని, సంధ్య ల కుమారుడు నవీన్ కు రూ.16,750, పదవ తరగతి చదువుతున్న ఆలియా అనే విద్యార్థిని తల్లి షాహిన్కు రూ. 12వేలు నగదు అందచేశామన్నారు. చదువుపై ఎంతో ఆసక్తి కలిగి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్న విషయం విద్యార్థుల తల్లిదండ్రులు తమ దృష్టికి తీసుకురావడంతో రోటరీ క్లబ్ సభ్యులందరూ వెంటనే స్పందించి వారికి మొత్తం రూ. 45,000 సాయం చేశామన్నారు. రోటరీ క్లబ్ ద్వారా సామాజిక సేవలతో పాటు విద్యార్థులు దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడలను, ఉచిత మెడికల్ క్యాంపులు లాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతి యేటా నిర్వహించే జోనల్ స్థాయి త్వరలోనే ఆదోని డివిజన్ స్థాయి ఇండోర్, అవుట్ డోర్ క్రీడ పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు శ్రీధర్ రెడ్డి, విట్ట మురళి, రాయచోటి సుబ్బయ్య, సునీల్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, వినోద్ జైన్, ప్రశాంత్ గాంధీ, ఇతేష్, సందీప్ రెడ్డి, కౌశిక్, సాబీర్, రాజేష్, హుస్సేన్ భాష తదితరులు పాల్గొన్నారు.

# మద్యం పై దశల వారీగా ఉద్యమం సిపిఎం




%దేవరాపల్లి :అక్టోబరు6 (సందేశం టైమ్స్): మద్యం బెల్టుషాపుల పై దశలవారీగా ఉద్యమం చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న, మండల కార్యదర్శి బిటి దొర పేర్కొన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సిపిఎం విస్తృత స్థాయి సమావేశం యం,ఎర్రు నాయుడు అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం వ్యాపారులు బరి తెగింపుకు పూను కుంటున్నారని యం.ఎర్రు నాయుడు తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామాలోను విచ్చలవిడిగా మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తూ పేదల కష్టాన్ని దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కేటాయించిన లైసెన్స్ షాపులకు, అనుబంధంగా గ్రామాల్లో మద్యం దుకాల యజమానులు చిన్న చిన్న గ్రామాల్లోను కిల్లి కోట్టులోను పాన్ షాపులు దాబాల్లోను టి కోట్టుల్లో సైతం విచ్చలవిడిగా మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని ఇది అత్యంత దుర్మార్గ మన్నారు. చిన్న పిల్లలు మహిళలు నిత్యం తిరుతున్న రోడ్లు పక్కన బెల్ట్ షాపులు నిర్వహించడం చట్టాన్ని విశ్మరించడ మేనని మండిపడ్డారు. ప్రభుత్వం కేటాయించిన ఎంఆర్‌పి ధరల కంటే బెల్ట్ షాపుల్లో బాటిల్‌కి రూ. 50 నుండి రూ.100 అదనంగా వసూళ్లు చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో మద్యం విక్రయించ డానికి అనధికారిక వేలం పాటలు లక్షల్లో నిర్వహించి బెల్టు షాపులు యజమానులు సొమ్ము చేసు కుంటున్నారని తెలిపారు. అక్రమ అమ్మకాలతో నిరు పేదలు, కూలీలు జేబులు ఖాళీ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో దర్జాగా మద్యం విక్రయాలు నిర్వహించడంతో యువత మద్యానికి బానిసలు అవుతున్నారని తెలిపారు. నిభందనల ప్రకారం గ్రామానికి కనీసం 200 మీటర్ల దూరంలో మద్యం షాపులు పెట్టాలని కాని ఇది ఎక్కడ అమలు కావడం లెదన్నారు. బడి, గుడి, ఆర్ టి సి కాంప్లెక్స్ వంటి ప్రదేశాల్లో పెట్ట రాదని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ మద్యం షాపులు నిర్వహించినప్పుడు కనీసం కీలోమీటారు దూరంలో షాపులు నిర్వహణ జరిగేదని ప్రస్తుతం నిబంధనలకు పాతర వేసారని తెలిపారు. గ్రామాల్లో అయితే,తెల్లవారుజాము నుంచే మద్యం బెల్ట్ షాపులు తెరిసి ఉంచుతున్నారని తెలిపారు. ఎంతో మంది పేద కుటుంబాలు వీటి ప్రభావంతో రోడ్డున పడు తున్నారని తెలిపారు. మరి కొన్ని గ్రామాల్లో మద్యం వ్యాపారం వలన మహిళలు, మైనర్ బాలికలపై హత్యచారాలు పెరిగి పోతున్నాయని దీన్ని నివారించ వలసిన ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకొకుండా నిమ్మకు నీరుత్తెనట్లు వ్యహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అక్రమ బెల్టు షాపులపై, లైసెన్సులు లేని దాబాల్లో మద్యం అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే దశలవారీగా పెద్ద ఎత్తున అందోన చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బి నాగేశ్వరరావు డి,శంకర్ సిహెచ్ దేముడు జె ఈశ్వరరావు వి దొంగబాబుతో పాటు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో ఒక వ్యక్తి ఇంట్లో ఉన్న టాయిలెట్ క్లీనర్ తాగి మృతిచెందాడు.




ఎస్.కోట రూరల్, అక్టోబరు6 (సందేశం టైమ్స్): మద్యం మత్తులో ఒక వ్యక్తి ఇంట్లో ఉన్న టాయిలెట్ క్లీనర్ తాగి మృతిచెందాడు. జరిగిన ఈ ఘటనపై సీఐ నారాయణమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శ్రీనివాసకాలనీలో నివాసం ఉంటున్న ముమ్మన రమణ(50) మద్యం తాగి ఇంటికి వచ్చాడు. అనంతరం ఇంట్లో ఉన్న టాయిలెట్ క్లీనర్ తాగడంతో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఇక్కడ వైద్యులు వెంటనే విజయనగరం మహారాజ ఆసుపత్రికి రిఫర్ చేశారు. రమణ అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# కురుపాం పచ్చకామెర్ల విద్యార్థినిలకు మెరుగైన వైద్యం...





పార్వతీపురం మన్యం:అక్టోబరు6 (సందేశం టైమ్స్): కురుపాం గురుకుల పాఠశాలలో విద్యార్థినులు పచ్చకామెర్లతో బాధపడుతుండడం కలకలం రేపుతోంది. ఈ నేపథ్యంలో పచ్చకామెర్ల వ్యాధి 5 శాతం కంటే ఎక్కువ ఉన్న విద్యార్థినులను అధికారులు మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు పార్వతీపురం ఆసుపత్రిలో గురుకులం సెక్రటరీ గౌతమి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థినిలు పచ్చకామెర్ల బారిన పడడానికి గల కారణాలు అన్వేషిస్తున్నట్లు చెప్పారు.ఈ విషయంపై రాష్ట్రస్థాయి అధికారుల బృందం దర్యాప్తు చేస్తున్నారని గౌతమి పేర్కొన్నారు. నీటి వల్ల ఈ వ్యాధి వచ్చిందనే అనుమానంతో అక్కడ వాటర్‌ను పరీక్షించినట్లు తెలిపారు. నీటిలో ఎటువంటి సమస్య లేదని నిర్ధారణ అయిందని వివరించారు. పచ్చకామెర్లు 5 శాతం కంటే ఎక్కువగా ఉన్న విద్యార్థినులు మొత్తం 36 మంది ఉన్నట్లు గుర్తించినట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో 120 మంది విద్యార్థినిలు చికిత్సపొందుతున్నట్లు గౌతమి స్పష్టం చేశారు.కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో 611 మంది చదువుతున్నారు. అయితే.. గతంలో ఈ పాఠశాలకు చెందిన ఇద్దరు బాలికలు పచ్చకామెర్ల లక్షణాలతో మృతి చెందారు. ఈ ఘటనతో సర్వత్రా ఆందోళన చెలరేగింది. దీంతో ప్రస్తుతం విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితికి గల కారణాలు తెలుసుకోవడానికి అధికారులు తీవ్రస్థాయిలో చర్యలు చేపడుతున్నారు.

# చీటీల పేరిట రూ.రెండున్నర కోట్లకు టోకరా..!



నూజివీడు టౌన్, అక్టోబరు6 (సందేశం టైమ్స్):నూజివీడుకు చెందిన సిరిగిరి వెంకటేశ్వరరావు(మోషే) కుల సంఘాన్ని అడ్డు పెట్టుకుని చీటీల పేరుతో తమను మోసం చేశాడంటూ పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వారు తెలిపిన వివరాలివి.. బుడగ జంగా ల కార్యదర్శిని అంటూ మోషే ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని నూజివీడు, హనుమాన్‌జంక్షన్, ధర్మాజీగూడెం, బంటుమిల్లి, కుక్కునూరు, కొత్తపల్లి తదితర ప్రాంతాల్లోని తమ కులస్తులను కలిసి.. మన వారి లాభం కోసమే తాను చిట్‌ఫండ్ నిర్వహిస్తున్నానని చెప్పాడు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని, ఎప్పుడు కావాలంటే అప్పుడు చిట్ పాడుకుని తీసుకోవచ్చని, డివిడెండ్ ఎక్కువ వస్తుందని నమ్మబలికాడు. తన వద్ద చిట్ వేస్తే ఆ సొమ్ము మీ ఇంటిలో వున్నట్టేనని చెప్పుకొచ్చాడు.

# యువకుడి వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య



కృష్ణా జిల్లా: అక్టోబరు6 (సందేశం టైమ్స్):యువకుడి లైంగిక వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పురుగులమందు తాగి ప్రాణాలు తీసుకుంది. ఈ సంఘటన కృష్ణా జిల్లా పామర్రు మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొమరవోలు గ్రామానికి చెందిన మెరుగుమాల పవన్ అనే వ్యక్తి కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన వివాహితను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు.రోజురోజుకూ అతడి వేధింపులు పెరుగుతూ పోయాయి. అతడి వేధింపులు భరించలేకపోయిన సదరు మహిళ షాకింగ్ నిర్ణయం తీసుకుంది. కలుపుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. కలుపు మందు తాగిందని గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెను వెంటనే గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా, చికిత్సపొందుతూ ఆసుపత్రిలోనే వివాహిత చనిపోయింది. పవన్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# వారంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలి

హైదరాబాద్/వరంగల్ వ్యవసాయం, అక్టోబరు6 (సందేశం టైమ్స్): రాష్ట్రంలో వారం రోజుల్లో పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం గడువు విధించింది. భారత పత్తి సంస్థ(సీసీఐ) అధికారులు, జిన్నింగ్ మిల్లర్లు ఏకాభిప్రాయానికి వచ్చి, పత్తి కొనుగోలు కేంద్రాలను తెరవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే ఆదేశించారు. అయితే, జాబ్ వర్క్ టెండర్లలో పాల్గొనకుండా మొండికేస్తున్న జిన్నింగ్ మిల్లర్లు, సీసీఐ అధికారులతో పలుమార్లు చర్చలు జరిపారు. ఈ సమస్యను కేంద్రం దృష్టికి కూడా తీసుకెళ్లారు. సోమవారం మరోసారి సచివాలయంలో సీసీఐ ఎండీ, జిన్నింగ్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది సీసీఐ తీసుకొచ్చిన కొన్ని నిబంధనల్లో ఒకటి, రెండు నిబంధనలను సడలించేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నా.. జిన్నింగ్ మిల్లర్లు మాత్రం మొండిపట్టు వీడకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మిల్లర్ల తీరుపై మంత్రి తుమ్మల ఆగ్రహం వ్యక్తంచేశారు. వచ్చే వారంలో పత్తి కొనుగోళ్లు చేపట్టాల్సిందేనని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.

21 నుంచి కొనుగోళ్లు: వరంగల్ సీసీఐ



రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి ఈ నెల 21 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తామని సీసీఐ వరంగల్ శాఖ ప్రకటించింది. తమ పరిధిలో త్వరలో 122 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపింది. కొనుగోలు కార్యకలాపాలను సులభతరం చేయడానికి ఇప్పటికే స్లాట్ బుకింగ్ యాప్‌ను ప్రారంభించినట్లు పేర్కొంది. పత్తి రైతులందరూ ప్రభుత్వ పోర్టల్‌లో తమ రిజిస్ట్రేషన్‌ను నిర్ధారించుకోవాలని సీసీఐ సూచించింది.

# క్వారీ పేలుళ్లతో ఒకరు మృతి



పాచిపెంట :అక్టోబరు6 (సందేశం టైమ్స్): మండలంలో చేపడుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల్లో భాగంగా క్వారీ పేలుళ్లలో బండ రాళ్లు తగిలి ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఎస్సై వెంకట సురేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం గ్రీన్ ఫీల్డ్ హైవే కెఎం స్టోన్ బంగారు గుడ్డు వద్ద రోడ్డు పనుల్లో భాగంగా కంపెనీ బండ రాళ్లను తొలగించే క్రమంలో పేలుడు పదార్థాలు వినియోగించారు. రాళ్లను పేల్చడంతో ఇద్దరు వ్యక్తులు నడుచుకుంటూ వెళ్తుండగా, వారికి రాళు తగలగా కేశవ్ కుమార్ అక్కడికక్కడే మరణించాడు. మరో వ్యక్తి సూరజ్ కుమార్‌కు బలమైన గాయాలవ్వడంతో విజయనగరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సదరు ఇద్దరు వ్యక్తులు బీహార్‌కు చెందిన వ్యక్తులు. వీరు కాంట్రాక్టర్ వద్ద కూలి పని చేస్తున్నట్లుగా తెలిపారు. ఇలా బండరాళ్లను పేల్చే క్రమంలో సరైన భద్రత పాటించనందున ఒక వ్యక్తి మరణానికి కారణం అవడం, మరో వ్యక్తికి బలమైన గాయాలకు కారణమైంది. బాధితుల కుటుంబ సభ్యులు అందుబాటులో లేనందున విఆర్ఓ ఇచ్చిన రిపోర్టుపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై వెంకట్ సురేష్ తెలిపారు.

# ఏపీలో భారీ అగ్ని ప్రమాదం.. ఏమైందంటే..




%విజయవాడ, అక్టోబరు6 (సందేశం టైమ్స్): విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు)లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఎనికేపాడులోని ఓ ప్రముఖ కంపెనీకి సంబంధించిన ఎలక్ట్రానిక్ పరికరాలు నిల్వచేసే గోదాంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మంటలు ఎగిసిపడితుండటంతో విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు అగ్నికి ఆహుతి అయినట్లు తెలుస్తోంది. భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చుట్టూ పక్కల ప్రాంతాలను పొగ కమ్మేసింది. పొగ ధాటికి స్థానికులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. స్థానికులను ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి దూరంగా పంపించివేస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. వెంటనే నిర్వాహకులు అగ్నిమాపక అధికారులకు, పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం అందటంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు ఫైర్ సిబ్బంది. ఈ అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని నిర్వాహకులు భావిస్తున్నారు. ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ. 5 కోట్లకు పైగా ఆస్తినష్టం జరిగి ఉంటుందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

# తెనాలిలో రోడ్డు ప్రమాదం



-తెనాలి (గుంటూరు జిల్లా) అక్టోబరు6 (సందేశం టైమ్స్): పట్టణంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ముగ్గురు వ్యక్తులు బైక్ పై వెళుతుండగా వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఘటనా స్థలంలో ఒకరు మృతి చెందగా, ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్యార్మి పండుగ సందర్భంగా తెనాలి వచ్చిన నయాబ్ రసూల్, మరో ఇరువురు తిరిగి అప్పికట్ల వెళుతుండగా వైకుంఠపురం-జగ్గడిగుంటపాలెం మధ్య వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. ప్రమాదంలో నయాబ్ రసూల్ (45) అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన గౌస్ బాషా, వసీం ను స్థానికులు జిల్లా వైద్యశాలకు తరలించారు. కాగా లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయినట్లు బాధితుల కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

# పిన్నిని నరికేసి.. 4 ముక్కలుగా చేసి..!

విజయవాడ, అక్టోబరు6 (సందేశం టైమ్స్): కట్టుకున్న భర్తను, కుమారుడిని వదిలిపెట్టి పుట్టింటికి వెళ్లిపోయిందో మహిళ. దీనికి కారణం తన చిన్నమ్మేనని అప్పటి నుంచి రగిలిపోతున్నాడు ఆ ఇల్లాలి భర్త. ఆ కోపాన్ని 13 ఏళ్ల తర్వాత కొడుకుతో కలిసి తీర్చుకున్నాడు. ఆమెను తన ఇంటికి తీసుకెళ్లి నరికి చంపి, నాలుగు ముక్కలుగా చేసి కాల్వల్లో పడేశాడు. విజయవాడలోని భవానీపురం హెచ్‌బీ కాలనీలో దసరా ముందు రోజు ఈ దారుణం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. భవానీపురం ఉర్మిళానగర్‌కు చెందిన పొత్తూరి విజయలక్ష్మి(65) కుమారుడితో కలిసి జీవిస్తోంది. కోడలు చనిపోవడంతో తల్లీకొడుకులిద్దరే ఇంట్లో ఉంటున్నారు. విజయలక్ష్మి అక్క కొడుకు వంకధార హనుమాన్‌జీ సుబ్రహ్మణ్యానికి భార్య హారిక, కుమారులు శ్రీమహావిష్ణు, ఇంటర్మీడియట్ చదువుతున్న 16 ఏళ్ల కుమారుడు, కుమార్తె శ్రీలక్ష్మి ఉన్నారు. భార్యభర్తల మధ్య వివాదాలు రావడంతో 2012వ సంవత్సరానికి ముందు ఆమె పెద్దకుమారుడిని, కుమార్తెనూ తీసుకుని తిరువూరు వద్ద ఉన్న కంభంపాడులోని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో సుబ్రహ్మణ్యం అప్పటి నుంచి రెండో కుమారుడితో





**గోనె సంచుల్లో కట్టి కాల్వల్లో పడేసిన వైనం**

**విజయవాడలో దారుణం.. పోలీసుల అదుపులో తండ్రీకొడుకు**

కలిసి ఉంటున్నాడు. దీనికి చిన్నమ్మే కారణమని నాటి నుంచి సుబ్రహ్మణ్యం రగిలిపోతున్నాడు. ఈనెల ఒకటో తేదీన విజయలక్ష్మి ఇంటికి వెళ్లాడు. మంచిగా మాట్లాడి ఆమెను బైకుపై హెచ్‌బీ కాలనీలోని తన ఇంటికి తీసుకెళ్లాడు. రెండో కుమారుడితో కలిసి ఇంట్లోనే పెద్ద కత్తితో మెడ నరికేశాడు. తర్వాత తండ్రీకొడుకులిద్దరూ కలిసి విజయలక్ష్మి శరీరాన్ని నాలుగు భాగాలుగా ముక్కలు చేశారు. వాటిని గోనె సంచుల్లో కుక్కి వేర్వేరు మురుగు కాల్వల్లో పడేశాడు. విజయలక్ష్మి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సుబ్రహ్మణ్యం ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి తండ్రీకొడుకులను అదుపులోకి తీసుకుని విచారించగా విషయం వెలుగులోకి వచ్చింది.

# రేపు ఫ్యాప్టో

# చలో విజయవాడ




పల్నాడు జిల్లా అక్టోబరు6 (సందేశం టైమ్స్): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం, డిమాండ్ల సాధన కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో మంగళవారం తలపెట్టిన 'చలో విజయవాడ'ను జయప్రదం చేయాలి పల్నాడు జిల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎం.మోహనరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు కరపత్రాలను నరసరావుపేటలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల నియంతలా వ్యవహరిస్తూ అనేక హక్కులను కాలరాసిందని, సమస్యల పరిష్కారానికి అప్పట్లో హామీనిచ్చిన కూటమి ఇప్పుడు చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. 4 డిఎ బకాయిలను విడుదల చేయాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి తప్పించి, బోధనకే పరిమితం చేయాలని కోరారు. యాప్‌ల భారం నుండి విముక్తి కల్పించాలని, సరెండర్ లీవ్, పిఎఫ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు బి.ప్రజామూర్తి, టి.వెంకటేశ్వర్లు, డివిఎస్ మూర్తి, కె.రవి, సి హెచ్.నాగేశ్వరరావు, ఎం.రామాంజనేయులు, టి.నాగరాజు పాల్గొన్నారు.

# నేడు విశాఖ పోర్టుకు వీఎల్‌జీసీ నౌక శివాలిక్



విశాఖపట్నం, అక్టోబరు6 (సందేశం టైమ్స్): షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా యాజమాన్యం పరిధిలోకి వచ్చిన వెరీ లార్జ్ గ్యాస్ క్యారియర్ (వీఎల్‌జీసీ) నౌక శివాలిక్ దేశంలోనే తొలిసారిగా విశాఖ పోర్టుకు సోమవారం రానుంది. ఎల్‌పీజీ రవాణా నిమిత్తం షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌సీఐ) గత నెల పదో తేదీన శివాలిక్ నౌకను తీసుకుంది. అబుదాబీ నుంచి విశాఖ పోర్టుకు రానుంది. ఈ నౌకకు కేంద్ర పోర్టులు, జల రవాణా శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్ స్వాగతం పలికి, నౌకలోని సిబ్బంది, అధికారులను అభినందిస్తారు. అనంతరం శాలిగ్రాంపురంలోని సాగరమాల కన్వెన్షన్ హాల్‌లో జరిగే బహిరంగ సభలో విశాఖపట్నం పోర్టు అథారిటీ చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారు. పోర్టు మౌలికసదుపాయాల అభివృద్ధి, నిర్వహణ సామర్థ్యాల పెంపు, పర్యావరణ హిత హరిత పోర్టు చర్యలను మారిటైమ్ ఇండియా విజన్- 2030కు అనుగుణంగా తీసుకెళ్లనున్న తీరును మంత్రి వెల్లడిస్తారు. శివాలిక్ నౌక భారత సముద్ర రవాణా రంగంలో మైలురాయిగా నిలుస్తుందని పోర్టు అధికారులు అభివర్ణిస్తున్నారు. భారత్ గ్యాస్ లాజిస్టిక్స్ సామర్థ్యాలను బలోపేతం చేయడమే కాకుండా ఆత్మ నిర్భర్ భారత్ లక్ష్య సాధనలో కీలక అడుగుగా అభివర్ణిస్తున్నారు.

# సీడ్ యాక్సెస్ గుబులు



తాడేపల్లి :అక్టోబరు6 (సందేశం టైమ్స్): సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభిస్తామనే సిఆర్‌డిఎ అధికారుల ప్రకటనతో తాడేపల్లి ప్రాంతంలోని రైతుల గుండెలు గుబేలు మటున్నాయి. మణిపాల్ హాస్పిటల్ నుండి సుందరయ్య నగర్ కట్ట ఈవతల నుండి ఆసుపత్రి పక్కగా, రైతుల పంట పొలాల్లో నుండి సీతానగరంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి సమీప నుండి బోటు యార్డులో గుండా, రైల్వే ట్రాక్ దాటి, సీతానగరం కొండ పక్కన ఉంటున్న పేదల ఇళ్ల మీదుగా సీడ్ యాక్సెస్ రోడ్డును గత టిడిపి ప్రభుత్వం రూపొందించింది. అయితే అనంతరం ఎన్నికల్లో టిడిపి ఓటమితో ఈ అంశం మరుగున పడింది. ప్రస్తుతం మళ్లీ తెరపైకి రావడంతో ఈ ప్రాంతంలో వారిలో ఆందోళన నెలకొంది. బకింగ్ హామ్ కాల్వ సమీప నుండి కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం సమీపంలోని పొలాల్లో ఫ్లైఓవర్ దిగుతుందని డిజైన్ రూపొందించారు. ఈ క్రమంలో న్యాయమైన పరిహారాన్ని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని సుమారు 160 కుటుంబాలూ బాధితులయ్యే అవకాశం ఉండడంతో వారూ తమ పరిస్థితి ఏమిటనే కంగారులో ఉన్నారు. తమ ఇళ్లనే తొలగించాల్సి వస్తే ప్రత్యామ్నాయంగా రెండు సెంట్ల స్థలాన్నీ ఇవ్వాలంటున్నారు.

# నగరంలో ఏం జరుగుతోంది..

## ఒకే సారి ఎండ, వాన

అక్టోబరు6 (సందేశం టైమ్స్): హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో వింత పరిస్థితి నెలకొంది. ఒకే సారి ఎండ, వాన జనాల్ని ఆశ్చర్యపరిచాయి. సాధారణంగా వాన పడుతున్నపుడు ఎండ ఉండదు. ఒక వేళ ఎండ కొట్టినా కొన్ని నిమిషాల్లోనే మబ్బులు కమ్మేస్తాయి. కానీ, సోమవారం ముందెన్నడూ లేని విధంగా ఓ వైపు వాన పడుతుంటే మరో వైపు ఎండకాసింది. అది కూడా గంటకు పైగా ఈ వింత పరిస్థితి చోటుచేసుకుంది. దీంతో జనం ఆశ్చర్యపోయారు. ఆ దృశ్యాన్ని యువత తమ ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు.ఇక, గ్రేటర్ హైదరాబాద్ వర్షంతో తడిసి ముద్దయింది. ఫిలింనగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, మణికొండ, దిల్ సుఖ్ నగర్, యూసఫ్ గూడ, అబిడ్స్, ఖైరతాబాద్, బోరబండ తదితర ప్రాంతాలలో వర్షం పడుతోంది. మరోవైపు.. యాదాద్రి




భువనగిరి జిల్లాలో మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. రుద్రవెల్లి వద్ద లో లెవెల్ బ్రిడ్జిపై నుంచి మూసీ వరద ప్రవహిస్తోంది. మూసీ వరద ప్రవాహంతో భూదాన్ పోచంపల్లి – బీబీనగర్ మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి.

# తెలంగాణలో డ్రగ్స్ పార్టీ భగ్నం..

## వెలుగులోకి సంచలన విషయాలు




%రంగారెడ్డి జిల్లా, అక్టోబరు6 (సందేశం టైమ్స్): మొయినాబాద్‌లో డ్రగ్స్ పార్టీ భగ్నం చేశారు రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు. ఇంటర్‌మీడియట్ చదువుతున్న 50 మందికి పైగా పార్టీలో పాల్గొన్నట్లు సమాచారం. ఈ పార్టీలో డ్రగ్స్ మద్యం, స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. చెర్రీ వోక్స్ ఫార్మ్ హౌస్ యజమానిపై కేసు నమోదు చేశారు పోలీసులు.డ్రగ్స్ పార్టీలో 14 మందికి పైగా యువతులు, 35 మందికి పైగా యువకులు పాల్గొన్నట్లు తెలుస్తోంది. వారికి డ్రగ్స్ టెస్ట్ నిర్వహించగా ఇద్దరికీ పాజిటివ్ వచ్చింది. ఫామ్‌హౌస్‌లో ఎలాంటి పర్మిషన్స్ లేకుండా ఉన్న 8 బాటిళ్ల మద్యాన్ని, డీజేని సీజ్ చేశారు పోలీసులు. పార్టీ నిర్వాహకుడు కిషన్‌తో పాటు మరో ఐదు మందిపై కేసు నమోదు చేశారు పోలీసులు. ఇన్‌స్టాగ్రామ్‌లో ట్రాప్ హౌస్ పేరుతో ఐడీ క్రియేట్ చేసి ఆన్‌లైన్ ద్వారా ఒక్కో విద్యార్థి నుంచి రూ.1300లు తీసుకున్నాడు నిర్వాహకుడు కిషన్.

# బస్సెనక బస్సు.. ఇబ్బందుల్లో ప్రయాణికులు



హన్వాడ, అక్టోబరు6 (సందేశం టైమ్స్): ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సమయానికి బస్సులు నడిపిస్తుంది. కానీ అందుకు విరుద్ధంగా బస్సు డ్రైవర్లు మా త్రం ఇష్టం వచ్చినట్లు బస్సులు నడిపిస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని అమలు చేసిన నాటి నుంచి ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు ఎప్పుడు వస్తాయో.. ఎప్పుడు వెళ్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఆదివారం సా యంత్రం 4.45 గంటల సమయంలో ఒకేసారి బస్సెనక బస్సు 14 బస్సులు తాండూర్ నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్లాయి. అన్ని మహబూ బ్‌నగర్, తాండూర్ డిపోలకు చెందిన బస్సులే. ప్రధానంగా ప్రైవేట్ బస్సు డ్రైవర్లు వారికి ఇష్టం వచ్చిన స్టేజీ వద్ద అపుతున్నారు. స్టాప్ వద్ద ప్రయాణికులు ఉండి, బస్సు ఖాళీగా ఉన్నా.. వారికి ఇష్టం లేకపోతే బస్సులు ఆపడం లేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే డ్రైవర్లు, కండక్టర్లు ప్రయా ణికులపై దురుసుగా మాట్లాడుతున్నారు. ఆర్టీసీ యాజమాన్యం నిఘా పెట్టి ప్రయాణికుల

# జూబ్లీహిల్స్‌కు నలుగురి పేర్లు!

హైదరాబాద్, అక్టోబరు6 (సందేశం టైమ్స్): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి నలుగురు నేతల పేర్లను ఇన్‌చార్జి మంత్రులు ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. స్థానిక నేతలు నవీన్ యాదవ్, సీఎన్ రెడ్డి, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, అంజన్‌కుమార్ యాదవ్‌ల పేర్లను వారు ప్రతిపాదించినట్లు సమాచారం. గెలిచే అవకాశం ఉన్న నేతల పేర్లను ప్రతిపాదించాల్సిందిగా ఉప ఎన్నికకు ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, వివేక్ వెంకటస్వామికి సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల సూచించిన విషయం తెలిసిందే. ఈ మేరకు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని నాలుగు పేర్లను ప్రతిపాదిస్తూ టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు వారు నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్ ఆదివారం ఢిల్లీకి వెళ్లడానికి ముందు ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌తో భేటీ అయ్యారు. సీఎం రేవంత్ సూచన మేరకు జరిగిన ఈ భేటీలో ఢిల్లీలో చేపట్టాల్సిన కార్యాచరణతోపాటు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ప్రతిపాదించిన నాలుగు పేర్ల పైనా ప్రాథమికంగా చర్చించారు. దీనిపై సోమవారం లేదా మంగళవారం సీఎం




రేవంత్‌రెడ్డితో భట్టివిక్రమార్క, మహేశ్‌గౌడ్, మీనాక్షీ నటరాజన్, మంత్రి ఉత్తమ్ సమావేశమై చర్చించనున్నట్లు తెలిసింది. సర్వేలు, నివేదికల ఆధారంగా ఆశావహుల జాబితాను షార్ట్‌లిస్ట్ చేసి మూడు పేర్లతో అధిష్ఠానానికి ప్రతిపాదన పంపనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రచారం జరుగుతున్న తీరుపై మీనాక్షీ నటరాజన్, మహేశ్‌గౌడ్ ఆదివారం ప్రజాభవన్‌లో సమీక్ష నిర్వహించారు. మంత్రి తుమ్మల, డివిజన్ల వారీ ఇన్‌చార్జులుగా ఉన్న వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. ఎన్నికల ప్రచారం వ్యక్తి కేంద్రీకృతంగా కాకుండా పార్టీ, సిద్ధాంతం కేంద్రీకృతంగా సాగాలని మహేశ్‌గౌడ్, మీనాక్షి సూచించారు. అభ్యర్థిని సర్వేల ఆధారంగా అధిష్ఠానం నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు.

# రిటైర్డు జర్నలిస్టులకు

## పెన్షన్ సౌకర్యం కల్పించాలి

హైదరాబాద్, అక్టోబరు6 (సందేశం టైమ్స్): సమాజ సేవాలక్ష్యంతో దశాబ్దాలుగా మీడియా సంస్థల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వయోధిక జర్నలిస్టుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రజా భవన్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసిన వయోధిక జర్నలిస్టుల సంఘం ప్రతినిధులు పెన్షన్ సౌకర్యం విస్తరణకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. రిటైర్డ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్‌లు, బస్సు పాసులు జారీ చేయాలని, రిటైర్డ్ జర్నలిస్టులు, వారి కుటుంబసభ్యులకు ఆరోగ్య వైద్య భీమా సౌకర్యాన్ని వర్తింపజేయాలని కోరారు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క.. రిటైర్డు జర్నలిస్టులకు



పెన్షన్ సౌకర్యం కల్పనకు ప్రజాప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తుందని హామీ ఇచ్చారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో వయోధిక జర్నలిస్టుల సంఘం నేతలు కేశవరావు, లక్ష్మణరావు, ఎన్.శ్రీనివాసరెడ్డి, బండారు శ్రీనివాసరావు, సి కేశవులు, ఫాజిల్, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

# 8 కారిడార్లు ఒకేసారి!

హైదరాబాద్ సిటీ, అక్టోబరు6 (సందేశం టైమ్స్): హైదరాబాద్ నగరంలో మెట్రోరైలు రెండో దశ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని క్షేత్రస్థాయిలో ఉండే అడ్డంకులను వడివడిగా తొలగించుకుని ముందుకు సాగేందుకు ప్రయత్నిస్తోంది. ఎల్అండ్‌టీ నుంచి మొదటి దశలోని మూడు కారిడార్ల నిర్వహణ బాధ్యతలను పూర్తిగా తీసుకునేందుకు ఆ సంస్థతో ఇటీవల ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో రెండో దశ పనులపై ఫోకస్ పెట్టింది. ఈ మేరకు మొత్తం 8 కారిడార్లకు సంబంధించిన నిర్మాణాన్ని ఒకేసారి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఎనిమిది కారిడార్లకు సంబంధించి మొత్తం 162.9 కిలోమీటర్ల పనులకుగాను రూ.43,847.22 కోట్లు కేటాయించింది. ప్రాజెక్టులో 48 శాతం వాటా కింద అంతర్జాతీయ బ్యాంకుల నుంచి 2–4 శాతం వడ్డీతో రుణాలు సేకరించనుంది. దీనికి కేంద్ర ప్రభుత్వం సావరీన్ గ్యారంటీ ఇవ్వడంతోపాటు తన వంతు వాటాగా 18 శాతం నిధులు సమకూర్చనుంది. ఇక ఎల్అండ్‌టీ నుంచి మొదటిదశ కారిడార్లను టేకోవర్ చేసుకున్న నేపథ్యంలో రెండో దశలో ప్రతిపాదించిన అన్ని కారిడార్లకు సంబంధించిన డీపీఆర్‌లకు కేంద్రం నుంచి అనుమతి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఢిల్లీలోని వివిధ శాఖల మంత్రులను పలు దఫాలుగా కలిసి రెండో దశ విస్తరణ ప్రాధాన్యాన్ని వివరించారు.ఎల్అండ్‌టీతో తమకు ఎలాంటి ఇబ్బందులు లేవని, నెట్ వర్కింగ్, టికెట్ ధరలన్నీ ఒకే గొడుగు కింద ఉంటాయని ప్రభుత్వం చెబుతోంది. ఈ మేరకు



ఎల్అండ్‌టీతో కుదుర్చుకున్న ఒప్పంద పత్రాలను కేంద్రానికి త్వరగా అందజేసేందుకు చర్యలు తీసుకుంటోంది. కేంద్రం నుంచి డీపీఆర్‌లకు గ్రీన్‌సిగ్నల్ లభించిన వెంటనే 8 కారిడార్లకు వేర్వేరుగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఒకే టెండర్ కింద అన్నింటినీ నిర్వహిస్తే పనులన్నీ ఆలస్యమవుతాయని భావిస్తోంది. దీంతో ఒక్కో సంస్థకు ఒక్కో కారిడార్‌ను అప్పగించి పూర్తి చేయించాలని చూస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తక్కువ దూరం కలిగిన ఎల్బీనగర్–హయత్‌నగర్ (7.1 కిలోమీటర్లు), ఎంజీబీఎస–చాంద్రాయణగుట్ట (7.5 కిలోమీటర్లు), రాయదుర్గం–కోకాపేట్ నియోపోలీస్ (11.6 కిలోమీటర్లు) పనులను పూర్తి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు రెండో దశలోని పార్ట్–ఏలో ప్రతిపాదించిన ఓల్డ్‌సిటీ కారిడార్‌కు ఆస్తుల సేకరణ ఇప్పటివరకు 65 శాతం పూర్తయింది. ఈ నెలాఖరులోగా మిగతా ఆస్తులను సేకరించి టెండర్ పిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ప్రాణాలు తీసిన డీజే మోత!




**బతుకమ్మ ఆడుతూ నవ వధువు సహా**
**ఇద్దరు మహిళల మృతి**
**నిర్మల జిల్లాలో విషాద ఘటనలు**


నిర్మల్ టౌన్/భైంసా రూరల్, అక్టోబరు6 (సందేశం టైమ్స్): నిర్మల్ జిల్లాలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో తీవ్ర విషాదం జరిగింది. డీజే సౌండ్ బాక్సుల మోత మధ్య బతుకమ్మ ఆడుతూ ఓ నవవధువు సహా ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. నిర్మల్‌లోని బంగల్‌పేట్ కాలనీలో అర్ధరాత్రి జరిగిన వేడుకల్లో డీజే సౌండ్‌తో బతుకమ్మ పాటలు పెట్టుకుని మహిళలు బతుకమ్మ ఆడారు. ఈ క్రమంలో బిట్లింగు భాగ్యలక్ష్మి(56) అనే మహిళ బతుకమ్మ ఆడుతుండగా గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలి మరణించినట్టు స్థానికులు తెలిపారు. అలాగే భైంసా మండలం వానల్‌పాడ్ గ్రామంలో జరిగిన ఘటనలో ఐదు నెలల క్రితమే పెళ్లి చేసుకున్న రుషిత(22) అనే నవవధువు ప్రాణాలు కోల్పోయింది. రాత్రి డీజే సౌండ్‌తో బతుకమ్మ పాటలు పెట్టుకుని బతుకమ్మ ఆడుతుండగా రుషిత అస్వస్థతకు గురైంది. గమనించిన కుటుంబీకులు స్థానికంగా చికిత్స అందించి, అనంతరం భైంసాలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కానీ చికిత్స అందే లోపే రుషిత ప్రాణాలు విడిచింది.

# ప్రియాంక బలవన్మరణంపై డీఎస్పీ విచారణ

గట్టు, అక్టోబరు6 (సందేశం టైమ్స్): గట్టు మండల పరిదిలోని చిన్నోనిపల్లి గ్రామాన్ని గద్వాల డీఎస్పీ మొగులయ్య ఆదివారం విచారణ చేపట్టారు. చిన్నోనిపల్లికి చెందిన కానిస్టేబుల్ రఘునాథ్‌గౌడు నమ్మించి మోసం చేయడంతో కొత్త గూడెం జిల్లా పాల్వచంకు చెందిన యువతి ప్రియాంక (32) మనస్తాపంతో పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటనకు సంబంధించి విచారణలో భాగంగా డీఎస్పీ మొగులయ్య, మి ట్టదొడ్డి గ్రామంతో పాటు చిన్నోనిపల్లి గ్రామాన్ని సందర్శించి ప్రియాంక ఉన్న ఇంటి పరిసరాలను పరిశీలించారు. అనంతరం చిన్నోనిపల్లి గ్రామస్థులతో పలు విషయాలను తెలుసుకున్నారు. డీఎస్పీ వెంట ఎస్ఐ కేటీ మల్లేష్ తదితరులు ఉన్నారు.



# క్రీడావార్తలు



## గిన్నిస్ రికార్డులో

# కోదాడకు గర్వకారణం

### చెన్నైలో కరాటే ప్రదర్శనలో పాల్గొన్న కరాటే క్రాంతి కుమార్




చెన్నై, (సందేశం టైమ్స్) అక్టోబర్ 5: చెన్నైలోని తాంబరం ప్రాంతంలోని ఎస్ఐవీఈటి కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన "అటెండ్ లార్జెస్ట్ కరాటే డిస్ప్లే" కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం ఖానాపురం గ్రామానికి చెందిన కరాటే మాస్టర్ కొండపల్లి క్రాంతి కుమార్ పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించారు. ఈ గిన్నిస్ టైటిల్ సాధనలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన వేలాది మంది కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ, "గిన్నిస్ రికార్డులో భాగస్వామ్యం కావడం ఎంతో గర్వకారణం. ఈ విజయంతో నా బాధ్యత మరింత పెరిగింది. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులను తీర్చిదిద్ది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా కృషి చేస్తాను. కోదాడ ప్రాంతంలో మార్షల్ ఆర్ట్స్ అబివృద్ధికి నా వంతు కృషి చేస్తాను," అని తెలిపారు. మార్షల్ ఆర్ట్స్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రభ్‌సిమ్రాన్ సెంచరీ



కాన్పూర్: ఆస్ట్రేలియా 'ఎ'తో మూడు మ్యాచ్‌ల అనధికార వన్డే సిరీసను భారత్ 'ఎ' 2-1తో దక్కించుకుంది. ఆదివారం ఇక్కడ ఉత్కంఠ భరితంగా జరిగిన మూడో మ్యాచ్‌లో భారత్ 'ఎ' రెండు వికెట్లతో నెగ్గింది. తొలుత ఆస్ట్రేలియా 'ఎ' 49.1 ఓవర్లలో 316 పరుగులకు ఆలౌటైంది. ఎడ్వర్డ్స్ (89), స్కాట్ (73), కొనొలీ (64) అర్ధ శతకాలు సాధించారు. అర్ష్‌దీప్, హర్షిత్ చెరో మూడేసి, బదోని రెండు వికెట్లు పడగొట్టారు. భారీ ఛేదనలో భారత్ 'ఎ' 46 ఓవర్లలో 322/8 స్కోరు చేసి గెలుపొందింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (102) సెంచరీతో చెలరేగాడు. కెప్టెన్ శ్రేయాస్ (62), పరాగ్ (62) హాఫ్ సెంచరీలో సత్తా చాటారు. చివర్లో వరుస వికెట్లు కోల్పోయి భారత్ 'ఎ' ఇబ్బందులో పడినా అర్ష్‌దీప్ (7 బ్యాటింగ్) అండగా విప్రాజ్ నిగమ్ (24 నాటౌట్) జట్టును విజయ తీరాలకు చేర్చాడు. టాడ్ మర్ఫీ, తన్వీర్ సంఘా చెరో 4 వికెట్లు తీశారు.

# వన్డేల్లోనూ గిల్ శకం




అహ్మదాబాద్: భారత క్రికెట్ జట్టులో ఇక నయా శకం ఆరంభం కాబోతోంది. వన్డే ఫార్మాట్‌కు కూడా కొత్త కెప్టెన్ వచ్చేశాడు. ఆస్ట్రేలియాలో పర్యటన కోసం శనివారం భారత వన్డే, టీ20 జట్లను సెలెక్టర్లు ప్రకటించారు. ఇందులో ఊహించని రీతిలో వన్డే జట్టు పగ్గాలు సైతం యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌కే దక్కాయి దీంతో సక్సెస్‌ఫుల్ కెప్టెన్‌గా పేరు తెచ్చుకున్న వెటరన్ రోహిత్ శర్మ ఆటగాడిగా మాత్రమే కొనసాగనున్నాడు. వైస్ కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్‌ను ఎంపిక చేశారు. 2027లో వన్డే వరల్డ్‌కపను దృష్టిలో ఉంచుకుని సెలెక్టర్లు కెప్టెన్సీ మార్పు చేశారు. ఈ ఏడాదే రోహిత్ నుంచి గిల్ టెస్టు బాధ్యతలు తీసుకున్న విషయం తెలిసిందే. ఈనెల 19 నుంచి 25 వరకు సిడ్నీ, అడిలైడ్, మెల్‌బోర్న్‌లలో 3 వన్డేలు జరుగుతాయి. అయితే రోహిత్‌తోపాటు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కూడా జట్టుతో కలువనున్నాడు. ఈ ద్వయం గత మార్చిలో జరిగిన చాంపియన్స్ ట్రోఫీలో చివరిసారి ఆడారు. ఇప్పటివరకు 55 వన్డేలు ఆడిన గిల్.. 8 సెంచరీలతో 2,775 పరుగులు సాధించాడు. మరోవైపు సీనియర్ పేసర్ బుమ్రాకు వన్డేల్లో విశ్రాంతినిచ్చారు. కానీ అక్షర్, కుల్దీప్, సుందర్‌ల రూపంలో ముగ్గురు స్పిన్నర్లను ఎంపిక చేసిన సెలెక్టర్లు ఈసారి ఆల్‌రౌండర్ జడేజాపై వేటు వేశారు. జట్టు సమతూకంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు, ఇద్దరు ఎడమచేతి స్పిన్నర్లు అవసరం లేదని భావించినట్టు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ స్పష్టం చేశాడు. వన్డే జట్టు ప్రణాళికల్లో మాత్రం జడ్డూ ఉంటాడని తేల్చాడు. పేస్ విభాగంలో సిరాజ్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్, హర్షిత్ ఉన్నారు. ఇక టీ20ల్లో నిలకడ ప్రదర్శిస్తున్న జైస్వాల్‌కు వన్డేల్లో చోటు కల్పించారు. కెరీర్‌లో అతను ఒక్క వన్డేనే ఆడాడు. హార్దిక్ స్థానంలో నితీశ్: ఆసియాకప్ టోర్నీలో భారత్‌ను విజేతగా నిలిపిన కెప్టెన్ సూర్యకుమార్‌కే టీ20 పగ్గాలు అప్పగించారు. బ్యాటర్‌గా అతను విఫలమైనా, సెలెక్టర్లు అతడి నాయకత్వ ప్రతిభపై నమ్మకముంచారు. ఆసీసతో ఈనెల 29 నుంచి నవంబరు 8 వరకు ఐదు టీ20ల సిరీస్ జరుగుతుంది. దాదాపుగా ఆసియాకప్‌లో పాల్గొన్న జట్టునే ఆసీస్ పర్యటనకు ఎంపిక చేశారు. అయితే గాయంతో జట్టుకు దూరమైన హార్దిక్ పాండ్యా స్థానంలో ఆంధ్ర ఆటగాడు నితీశ్ కుమార్‌ను తీసుకున్నారు. నితీశ్ అటు వన్డే జట్టులోనూ చోటు దక్కించుకోవడం విశేషం. ఇక అదనపు స్పిన్నర్‌గా వాషింగ్టన్ సుందర్ కూడా జట్టులోకి వచ్చాడు. గిల్ (కెప్టెన్), రోహిత్, కోహ్లీ, శ్రేయాస్ (వైస్ కెప్టెన్), జైస్వాల్, అక్షర్, రాహుల్, నితీశ్, సుందర్, కుల్దీప్, హర్షిత్, సిరాజ్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్, జురెల్.

టీ20 జట్టు

సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్, గిల్ (వైస్ కెప్టెన్), తిలక్, నితీశ్ కుమార్, దూబే, అక్షర్, జితేశ్, శాంసన్, వరుణ్, బుమ్రా, అర్ష్‌దీప్, కుల్దీప్, హర్షిత్, రింకూ సింగ్, సుందర్.

ఎందుకిలా..?

టెస్టు జట్టుతో పాటు వన్డే పగ్గాలు కూడా రోహిత్ నుంచి చేజారాయి. ఈ ఏడాది మార్చిలో అతని ఆధ్వర్యంలోనే జట్టు చాంపియన్స్ ట్రోఫీ నెగ్గింది. గతేడాది టీ20 వరల్డ్‌కపను కూడా అందించాడు. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో జట్టును ఫైనల్ చేర్చాడు. అయినా ఈ అనుభవశాలిని కాదని, వెస్టిండీసపై తొలి టెస్టులో భారత్ గెలిచిన గంటలోపే వన్డే కొత్త కెప్టెన్ పేరును సెలెక్టర్లు ప్రకటించారు. రోహిత్ కెప్టెన్‌గా 56 వన్డేల్లో 42 మ్యాచ్‌ల్లో జట్టును గెలిపించాడు. సారథిగా అతడి విజయాలశాతం 76 కావడం విశేషం. కానీ ఇంగ్లండ్ పర్యటనలో గిల్ జట్టును నడిపించిన తీరు సెలెక్టర్లను ఆకట్టుకుంది. గిల్ సారథిగానే గాకుండా బ్యాటర్‌గానూ విజృంభించాడు. ఇప్పటికే రోహిత్ టెస్టు, టీ20లకు వీడ్కోలు పలికి వన్డేలకే పరిమితమయ్యాడు. ఇక, మూడు ఫార్మాట్లకు ముగ్గురు కెప్టెన్లను నియమించడం ఆచరణయోగ్యం కాదని బీసీసీఐ భావిస్తోందట. అందుకే 2027 వన్డే వరల్డ్‌కప్‌ను దృష్టిలో ఉంచుకుని, ఈలోపు కెప్టెన్‌గా గిల్‌కు తగినంత సమయం ఇచ్చి విశ్వకప్ నకు సిద్ధం చేయాలని బోర్డు అనుకుం టోంది.

## శ్రియాన్షికి తొలి సూపర్ టైటిల్



అల్ ఐన్ (యూఏఈ): తెలుగమ్మాయి శ్రియాన్షి వలిశెట్టి కెరీర్‌లో తొలి బీడబ్ల్యూఎఫ్ సూపర్ 100 టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం ముగిసిన అల్ ఇన్ మాస్టర్స్ మహిళల సింగిల్స్ ఫైనల్లో హైదరాబాద్ యువ షట్లర్ శ్రియాన్షి 15-21, 22-20, 21-7తో భారత్‌కే చెందిన తస్నీం మీర్‌పై గెలిచింది. హోరాహోరీ పోరులో తొలి గేమ్ ఓడిన శ్రియాన్షి..తర్వాతి రెండు గేముల్లో సత్తా చాటి విజేతగా నిలిచింది.

## టైటాన్స్ ఆల్‌రౌండ్ షో



చెన్నై: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో తెలుగు టైటాన్స్ వరుసగా నాలుగో విజయం సాధించింది. ఆదివారం చెన్నై వేదికగా యూపీ యోధాస్‌తో జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 40-35తో గెలిచింది. టైటాన్స్ ఈ మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. విజయ్ భరత్ 14 పాయింట్లతో సూపర్-10 సాధించడంతో పాటు పీకేఎల్‌లో 700 రైడ్ పాయింట్ల మైలురాయికి చేరుకున్నాడు. మరో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 33-29తో తమిళ్ తలైవాస్‌ను ఓడించింది.

## మళ్లీ ఓడిన అఫ్ఘాన్



షార్జా: అఫ్ఘానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీసను బంగ్లాదేశ్ 3-0తో క్లీన్‌స్వీప చేసింది. ఆదివారం జరిగిన మూడో, ఆఖరి టీ20లో బంగ్లా 6 వికెట్ల తేడాతో అఫ్ఘాన్‌ను ఓడించింది. తొలుత అఫ్ఘాన్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 143 పరుగులు చేసింది. సైఫుద్దీన్ 3, నసుమ్, తన్జిమ్ షకిబ్ చెరో 2 వికెట్లు తీశారు. ఛేదనలో బంగ్లా 18 ఓవర్లలో 144/4 స్కోరు చేసి గెలిచింది. సైఫ్ హసన్ (64 నాటౌట్) సత్తా చాటాడు.

## పాకిస్తాన్‌కు సవాల్..టార్గెట్ స్కోర్ చేరుకునేందుకు కష్టాలు



ఐసీసీ మహిళల వన్డే వరల్డ్ కప్ 2025లో భారత్-పాకిస్తాన్ మధ్య జరుగుతున్న మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. శ్రీలంకలోని కొలంబో వేదికగా జరుగుతున్న ఈ పోరులో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 247 పరుగులు సాధించి, పాక్ ముందు 248 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. భారత మహిళల జట్టు చివరకు సమర్థంగా బ్యాటింగ్ చేసి, పాకిస్తాన్‌కు మంచి సవాల్ స్కోరును అందించింది. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు పాకిస్తాన్ కష్టపడుతూనే ఉంది. ప్రస్తుతం పాక్ జట్టు ఐదు వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. దీంతో పాకిస్తాన్ జట్టు కష్టాల్లో పడింది. ఈ స్కోర్ ప్రకారం చూస్తే పాకిస్తాన్ జట్టు గెలవడం చాలా కష్టమని చెప్పవచ్చు. భారత్‌పై వన్డేల్లో వరుసగా 11 ఓటముల సిరీస్‌ను బ్రేక్ చేయాలంటే పాకిస్తాన్ జట్టు ఈ మ్యాచ్‌లో గెలవాలి. కానీ చివరకు ఏ జరుగుతుందో చూడాలి మరి. పాకిస్తాన్ మహిళల జట్టులో: మునీబా అలీ, ఒమైమా సొహైల్, సిద్రా అమీన్, రమీన్ షమీమ్, ఆలియా రియాజ్, సిద్రా నవాజ్ (వికెట్ కీపర్), ఫాతిమా సనా (కెప్టెన్), నటాలియా పర్వైజ్, డయానా బేగ్, నష్రా సంధు, సాదియా ఇక్బాల్, షవాల్ జుల్ఫికర్, ఎయ్మన్ ఫాతిమా, సయీదా అరూబ్ షా, సదాఫ్ షమాస్. భారత్ మహిళల జట్టులో: ప్రతీకా రావల్, స్మృతి మంధాన, హర్లీన్ డియోల్, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), జెమిమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), అమన్‌జోత్ కౌర్, స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్, శ్రీ చరణి, రాధా యాదవ్, రేణుకా సింగ్ ఠాకూర్, అరుంధతి రెడ్డి, ఉమా చెత్రి.

# బిజినెస్



## లాభాలతో ప్రారంభమైన సూచీలు.. ఈ రోజు టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..




బ్యాంకింగ్, ఫైనాన్సియల్ రంగాల్లో కొనుగోళ్లు దేశీయ సూచీలను లాభాల బాట పట్టిస్తున్నాయి. ఈ రెండు రంగాల్లోని పలు స్టాక్స్ ఆకర్షణీయంగా ఉండడంతో పాటు భవిష్యత్తు ఆశాజనకంగా ఉండడంతో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపుతున్నారు. మరోవైపు ఐపీవో జోష్ కూడా సూచీలను ముందుకు నడిపిస్తోంది. దీంతో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో కదలాడుతన్నాయి. గత శుక్రవారం ముగింపు (81, 207)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం దాదాపు 70 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత పైకి ఎగబాకింది. ఆర్బీఐ వడ్డీ రేట్ల ప్రకటన బ్యాకింగ్ సెక్టార్‌కు పాజిటివ్‌గా మారింది. ప్రస్తుతం ఉదయం 9:45 గంటల సమయంలో సెన్సెక్స్ 161 పాయింట్ల లాభంతో 81, 368 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 48 పాయింట్ల లాభంతో 24, 943 వద్ద కొనసాగుతోంది %సెన్సెక్స్‌లో బీఎస్ఈ లిమిటెడ్, డెలివరీ, మ్యాక్స్ హెల్త్‌కేర్, బజాజ్ ఫైనాన్స్, ఫోర్టిస్ హెల్త్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి. సమ్మన్ క్యాపిటల్, వోడాఫోన్ ఐడియా, ఎల్ అండ్ టీ ఫైనాన్స్, అవెన్యూ సూపర్ మార్కెట్, జిందాల్ స్టీల్ మొదలైన షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 92 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 308 పాయింట్ల లాభంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 88.75గా ఉంది.

## 2047 నాటికి జీడీపీలో 25 శాతం ఆస్తులు లక్ష్యం




న్యూఢిల్లీ: అభివృద్ధి కోసం ప్రభుత్వ రంగంలోని అతి పెద్ద బ్యాంక్ ఎస్‌బీఐ భారీ లక్ష్యాలను పెట్టుకుంది. ఇందుకోసం ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని నిర్ణయించింది. 'వికసిత్ భారత్' సాధనకు నిర్దేశించుకున్న లక్ష్యం 2047 నాటికి దేశ జీడీపీలో తమ బ్యాంకు ఆస్తులను 25 శాతానికి పెంచుకోవాలని భావిస్తున్నట్టు ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులుశెట్టి తెలిపారు. ఎన్‌పీసీఐ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయం వెల్లడించారు. ప్రస్తుతం దేశ జీడీపీలో ఎస్‌బీఐ ఆస్తుల వాటా 20 శాతం వరకు ఉంది. ఆస్తుల పరంగా ప్రస్తుతం ప్రపంచంలోని టాప్–50 బ్యాంకుల్లో ఎస్‌బీఐ 43వ స్థానంలో ఉంది. 2047 నాటికి ఆస్తి–అప్పుల పట్టీని (బ్యాలెన్స్ షీట్) మరిం త మెరుగుపరుచుకుని ప్రపంచంలోని టాప్–10 లేదా టాప్–20 బ్యాంకుల జాబితాలో స్థానం సంపాదిస్తామన్నారు. "ప్రస్తు తం దేశ జీడీపీలో మా ఆస్తుల వాటా 20 శాతం వరకు ఉంది. 2047 నాటికి దీన్ని 25 శాతానికి అంటే జీడీపీలో నాలుగో వంతుకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అప్పటికి ప్రపంచంలోని టాప్–10 లేదా టాప్–20 బ్యాంకుల్లోనూ స్థానం సంపాదిస్తాం' అని శ్రీనివాసులు శెట్టి చెప్పారు.కొత్త రంగాలకు రుణ మద్దతు: సెమీకండక్టర్లు, గ్రీన్ హైడ్రోజెన్, బ్యాటరీ స్టోరేజి వంటి నూతన వ్యా పార రంగాలపై కంపెనీలు, ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైందని ఎస్‌బీఐ చీఫ్ చెప్పారు. ఇలాంటి కొత్త ప్రాజెక్టులకు తమ రుణ మద్దతు ఉంటుందన్నారు. ఇందుకోసం ఆయా పరిశ్రమ వర్గాల తో సమన్వయం కోసం 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్' ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. సరికొత్త రంగాలు భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఎంతో తోడ్పడనున్నాయన్నారు. గత ఆర్థిక సంవత్సరం చివరికి ఎస్‌బీఐ ఆస్తి–అప్పుల పట్టి (బ్యాలెన్స్ షీట్) రూ.66 లక్షల కోట్లు దాటిందని చెప్పారు.అంతర్జాతీయంగానూ ఆసరా : విదేశీ మార్కెట్లలో ఎదగాలనుకునే భారత కంపెనీలకు సైతం ఎస్‌బీఐ మద్దతు కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం తమ బ్యాంకు కు 29 దేశాల్లో 240 పైగా శాఖలు ఉన్న విషయాన్ని శ్రీనివాసులు శెట్టి గుర్తు చేశారు. ఈ శాఖల ద్వారా భారత కంపెనీల ఎగుమతుల వృద్ధి, విదేశీ రుణ సేకరణకు అవసరమైన సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం తమ ఆస్తి–అప్పుల పట్టిలో విదేశాల్లోని శాఖల వాటా 10 శాతం వరకు ఉందన్నారు. ముందు ముందు దీన్ని 12 నుంచి 13 శాతానికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు.

## ట్రేడింగ్‌లో మిశ్రమ ధోరణికి ఆస్కారం



స్టాక్ మార్కెట్ ఈ వారంలో మిశ్రమ ధోరణిలో ట్రేడ్ కావొచ్చు. మారుతున్న భౌగోళిక రాజకీయ సమీకరణాలు, ఆర్‌బీఐ సమీక్ష నేపథ్యంలో కొన్ని రంగాల షేర్లు తీవ్ర ప్రభావానికి లోనయ్యే అవకాశముంది. వరుసగా ఎనిమిది సెషన్లు నష్టపోయిన బెంచ్‌మార్క్ సూచీలు చివరి రెండు సెషన్లలో భారీగా పెరిగాయి. ఆటోమొబైల్, ప్రభు త్వ రంగ బ్యాంకింగ్, మెటల్, డిఫెన్స్, గ్లాస్, ఆయిల్ అన్వేషణ రంగాలు జోరు ప్రదర్శిస్తున్నాయి.

టాటా స్టీల్: కొన్ని నెలలుగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు ప్రస్తుతం కీలకమైన రూ.160 జోన్‌లో ఉంది. రిలేటివ్ స్ట్రెంత్ మెరుగ్గా ఉంది. ఐరన్ అండ్ స్టీల్ సెక్టార్ సైతం జోరు ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం 3.4 ౖ లాభంతో రూ.173 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.195 టార్గెట్ ధరతో రూ.170పై శ్రేణిలో పొజిషన్ తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.166.బంధన్ బ్యాంకు: చాలా కాలంగా ఈ షేర్లులో దిద్దుబాటు జరుగుతూనే ఉంది. కొన్ని రోజులుగా ప్రైవేటు బ్యాంకింగ్ సెక్టార్ మూమెంటమ్ మెరుగవుతూ వస్తోంది. గత శుక్రవారం రూ.165 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.185 టార్గెట్ ధరతో రూ.160 శ్రేణిలో అక్యూములేట్ చేసుకోవచ్చు. స్టాప్‌లాస్ రూ.157.ఆదిత్య బిర్లా క్యాపిటల్: ప్రస్తుతం ఈ షేర్లు జీవితకాల గరిష్ట స్థాయిలో కొనసాగుతున్నాయి. రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ బాగున్నాయి. పైగా అక్యూములేషన్ జోన్‌లో ఉన్నాయి. గత శుక్రవారం రూ.303 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.340 టార్గెట్ ధరతో రూ.290 శ్రేణిలో పొజిషన్ తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.280.ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్: ఈ ఏడాది ఆరంభం నుంచి ఈ కౌంటర్లో అక్యూములేషన్ జరుగుతోంది. ప్రస్తుతం రివర్సల్‌కు అవకాశం కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.209 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.230 టార్గెట్ ధరతో రూ.205 వద్ద పొజిషన్ తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.205.కోటక్ బ్యాంకు: ఆరు నెలలుగా ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో ఉంది. ఆర్‌బీఐ ద్రవ్యవిధాన సమీక్ష ముగిసిన నేపథ్యంలో వీటిపై ఇన్వెస్టర్ల ఆసక్తి పెరిగింది. గత శుక్రవారం రూ.2100 ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.2250 టార్గెట్ ధరతో రూ. 2050 వద్ద ప్రవేశించవచ్చు. స్టాప్‌లాస్ : రూ. 2010.

## మీ నగరంలో ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..




బంగారం ధర రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (అక్టోబర్ 6న) 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 19, 390కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 09, 440కి చేరింది ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 19, 540కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 09, 590కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 19, 390కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 1, 09, 440కి చేరింది . వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద రూపాయిల మేర తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం

## బిట్‌కాయిన్ కొత్త రికార్డు



న్యూయార్క్: ప్రపంచంలో అతి పెద్ద క్రిప్టోకరెన్సీ 'బిట్‌కాయిన్' ధర చుక్కలంటింది. ఆదివారం ఒక దశలో 1,25.245.57 డాలర్లకు చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. శనివారంతో పోలిస్తే ఇది 2.7 శాతం ఎక్కువ. దీంతో బిట్‌కాయిన్ మార్కెట్ క్యాప్ ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్‌ను మించిపోయింది. సంస్థాగత మదుపరుల కొనుగోళ్లు, ట్రంప్ సర్కారు సానుకూల వి?ధానాలు, ప్రధా న కరెన్సీలతో పడిపోతున్న డాలర్ మారకం రేటు, అమెరికా ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాల స్తంభన బిట్‌కాయిన్ ర్యాలీకి కారణాలుగా కనిపిస్తున్నాయి.

## పెరగనున్న ముడి చమురు ఉత్పత్తి




వియన్నా (ఆస్ట్రియా): నవంబరు నుంచి ముడి చమురు రోజువారీ ఉత్పత్తిని 1.37 లక్షల బ్యారెళ్ల మేర పెంచాలని ఒపెక్ దేశాల కూటమి, రష్యా నిర్ణయించాయి. తాము కోల్పోయిన వాటా పెంచుకునేందుకు రోజువారీ ఉత్పత్తిని 2.74 లక్షల నుంచి 5.48 లక్షల బ్యారెళ్ల మేర పెంచాలని సౌది అరేబియా పట్టుపట్టింది. అయితే మెజారిటీ దేశాలు 1.37 లక్షల బ్యారెళ్ల పెంపునకు అమోదం తెలిపాయి. దీంతో ఈ సంవత్సరం మార్చి నుంచి ఈ దేశాలు అమలు చేస్తున్న ఉత్పత్తి కోతకు తెరపడింది. తాజా నిర్ణయంతో ప్రస్తుతం 65 డాలర్ల వద్ద ట్రేడవుతున్న బ్రెంట్ రకం చమురు బ్యారెల్ ధర మరింత దిగి వస్తుందని భావిస్తున్నారు.

## 25000 పైన నిలదొక్కుకోవడం కీలకం

నిఫ్టీ గత వారం పునరుజ్జీవం బాట పట్టి 240 పాయింట్లకు పైగా లాభంతో 24,900 వద్ద ముగిసింది. ముందు వారంలో ఏర్పడిన బలమైన డౌన్‌ట్రెండ్ అనంతరం ఏర్పడిన టెక్నికల్ రికవరీ ఇది. కాని మైనర్ రికవరీ కావడం వల్ల పరిమిత కదలికలు మరి కొంత కాలం కొనసాగే ఆస్కారం ఉంది. నెలవారీగా చూసినా కనిష్ఠ స్థాయిల్లో ముగిసినప్పటికీ ఇంకా ప్రధాన మద్దతు స్థాయిల కన్నా పైనే ఉంది. మార్కెట్ ఎలాంటి కన్సాలిడేషన్ లేకుండానే గత వారంలో 'వి' ఆకారంలో రికవరీ సాధించినందువల్ల సానుకూల సంకేతం కోసం తొలుత కన్సాలిడేట్ అయి నిలదొక్కుకోవాలి. ప్రస్తుతం మానసిక అవధి 25,000 సమీపంలో ఉన్నందు వల్ల ఈ వారంలో అప్రమత్తంగా ప్రారంభమయ్యే ఆస్కారం ఉంది.బుల్లిష్ స్థాయిలు: స్వల్పకాలిక సానుకూల సంకేతం ఇవ్వాలంటే మార్కెట్ కీలక నిరోధం 25,000 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి. గత కొద్ది నెలల్లో ఈ కీలక స్థాయిలోనే మార్కెట్ విఫలమవు తూ వస్తోంది. ప్రధాన నిరోధ స్థాయిలు 25300, 25500.బేరిష్‌స్థాయిలు: 25000 వద్ద విఫలమైతే అప్రమత్త సంకేతం ఇస్తుంది. దిగువన మద్దతు స్థాయి 24,700. ఇక్కడ విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 24,500. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనతగా భావించి అప్రమత్తం కావాలి.బ్యాంక్ నిఫ్టీ ఈ సూచీ గత వారం మంచి పనితీరుతో 1200 పాయింట్లకు పైగా బలపడి మూడు వారాల గరిష్ఠ స్థాయి 55,600 వద్ద ముగిసింది. ప్రధాన నిరోధం 55,600. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. ప్రధాన మద్దతు స్థాయి 55,000. ఇక్కడ విఫలమైతే బలహీనత ముప్పు తప్పదు.పాటర్న్: స్వల్పకాలిక చలన సగటు స్థాయి 25,000 కన్నా నిఫ్టీ స్వల్పంగా దిగువన ఉంది. సానుకూలత కోసం ఇదే స్థాయిలో "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి.టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006